

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575

www.rajamudranews.com
అక్షర
# రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక
AKSHARA RAJAAMUDHRA
RNI No: TELTEL/2024/86684

విలేకరులు కావలెను
'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.
సంప్రదించాల్సిన చిరునామా..
సెల్ : 9182 474 575

| మేడ్చల్-మల్కాజ్‌గిరి | మంగళవారం | 06.01.2026 | సంపుటి : 2 | సంచిక :331 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | Tuesday | 06.01.2026 | volume : 2 | Issue : 331 | Pages : 8 | Cost : 2/- |



# చర్చల ద్వారా పరిష్కరించుకోండి

గోదావరిలో వరద జలాల పేరుతో అసలు జలాలకు ఎసరు పెట్టాలని ఏపీ ప్రయత్నిస్తోందని సుప్రీంకోర్టులో తెలంగాణ తరపు న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపించారు. ఏపీ నిర్మిస్తున్న పోలవరం -నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టు కేసు విచారణ సోమవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వం లోని ధర్మాసనం ఎదుట జరిగింది. తెలంగాణ తరపున సింఘ్వీ వాదనలు వినిపిస్తూ.. నల్లమల సాగర్ ద్వారా గోదావరి జలాల్లో అవార్డు ప్రకారం కేటాయించిన 480 టీఎంసీలకు మించి వాడుకునేందుకు ఏపీ ప్రయత్నిస్తోందన్నారు.

– న్యూఢిల్లీ, జనవరి 5

## 'గోదావరి జల వివాదం'పై కూర్చుని మాట్లాడుకోండి..

మధ్యవర్తిత్వం, సివిల్ సూట్ సహా 3 ప్రత్యామ్నాయ మార్గాలను ప్రతిపాదించిన ప్రధాన న్యాయమూర్తి

నిబంధనలకు విరుద్ధంగా ఏపీ 'పోలవరంఉనల్లమల సాగర్' ప్రాజెక్టు చేపట్టిందన్న తెలంగాణ

తెలంగాణ, ఏపీలకు సుప్రీంకోర్టు హితవు

తక్షణమే స్టే ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి

ప్రస్తుతం పీఎఫ్ఆర్, డీపీఆర్ కోసం సర్వేలు, టెండర్ల ప్రక్రియ మాత్రమే చేపట్టామన్న ఏపీ

తదుపరి విచారణ ఈ నెల 12వ తేదీకి వాయిదా

## వ్యవసాయ రంగానికి కూడా సోలార్ విద్యుత్

రాష్ట్రంలో విస్తృతంగా అందుబాటులోకి సోలార్ పవర్


పీఎం సూర్య ఘర్ పథకానికి ప్రజల్లో స్పందన అంతంత మాత్రమే

మండలిలో డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క వెల్లడి



హైదరాబాద్, జనవరి 5 :రాష్ట్రంలో సోలార్ పవర్‌ను విస్తృతంగా అందుబాటులోకి తీసుకు రావాలన్న దిశగా ప్రభుత్వం ఆలోచన చేస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం

-మిగతా 2 లో..


04

మరోమారు భారత్‌పై
### ట్రంప్ అక్కసు
మరిన్ని టారిఫ్‌లు విధిస్తానంటూ హెచ్చరికలు


04

### మళ్లీ పెరిగిన బంగారం ధరలు
వెండి కిలో మరో ఆరువేలు పెరుగుదల



### మంత్రులతో కలసి సిఎం బస్సు ప్రయాణం

హైదరాబాద్, జనవరి 5 : సీఎం రేవంత్ రెడ్డి ఆర్టీసీ బస్సులో బస్సులో ప్రయాణించారు. శాసనసభ సమావేశాల అనంతరం అసెంబ్లీ నుంచి బంజారాహిల్స్‌లోని ప్రసాద్ ల్యాబ్స్ వరకు మంత్రులతో కలిసి ఆయన బస్సులో ప్రయాణం చేశారు. ప్రసాద్ ల్యాబ్స్‌లో ప్రత్యేకంగా ప్రదర్శించిన 'ఫులే' సినిమాను మంత్రులు, సీనియర్ నేతలతో కలిసి సీఎం వీక్షించారు.

## తెలంగాణలో విద్యావ్యవస్థ చిన్నాభిన్నం

నాటి బిఆర్ఎస్, నేటి కాంగ్రెస్ విధానాలే కారణం

ఎబివిపి మహాసభల్లో కేంద్రమంత్రి బండి సంజయ్

02

బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో, కాంగ్రెస్ రెండేళ్ల పాలన ఫలితంగా తెలంగాణలో ప్రభుత్వ విద్యా వ్యవస్థ చిన్నాభిన్నమైందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పాలనలో 6 వేల స్కూల్స్ మూసివేస్తే కాంగ్రెస్ పాలనలో వాటిని తెరవకపోగా ఒక్క ఏడాదిలోనే 1500 స్కూల్స్ మూసివేశారని చెప్పారు.




## నిండు సభలో కవిత కంటతడి

వ్యక్తిగా వెళుతున్నా.. శక్తిగా తిరిగి వస్తా

ప్రశ్నిస్తే.. కారణం లేకుండా బయటకు పంపారు

హరీష్ రావు అవినీతికి అంతు లేదు

సిద్దిపేట తడితర కలెక్టరేట్లు ఒక్క వానకే కూలాయి

కింది నాయకులు దురాగతాలను పట్టించుకోని కెసిఆర్

ఇదే నాచివరి ప్రసంగం అంటూ మండలిలో భావోద్వేగంతో కన్నీరు

కొత్త రాజకీయ వేదిక రాబోతోందంటూ పార్టీపై కవిత వెల్లడి




హైదరాబాద్, జనవరి 5 : బిఆర్ఎస్ పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం లేదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్‌పై కక్షతో బిజెపి నన్ను జైలులో పెట్టించిందని ఆరోపించారు. శాసనమండలిలో ఇదే తన చివరి ప్రసంగం అంటూ మాట్లాడిన ఎమ్మెల్సీ కవిత.. సంచలన కామెంట్స్

-మిగతా 2 లో..


04

ఫోన్ ట్యాపింగ్ కేసులో
### హరీష్ రావుకు ఊరట
ప్రభుత్వ పిటిషన్ కొట్టివేసిన సుప్రీం ధర్మాసనం


03

దేవుడిని కూడా వదలకపోవడం దారుణం
శబరిమల బంగారం మాయం కేసులో సుప్రీం వ్యాఖ్య



### నేటి చికెన్ ధరలు

| | |
|---|---|
| ఫారం ధర లైవ్ బర్డ్ | 150 (కిలో) |
| రిటైల్ లైవ్ బర్డ్ | 177 (కిలో) |
| డ్రెస్ట్ స్కిన్‌తో | 257 (కిలో) |
| స్కిన్ లెస్ | 292 (కిలో) |

12 గుడ్ల రిటైల్ ధర ₹82

ఇంటర్ స్టేట్ రూల్స్‌కు వ్యతిరేకమని
## జీఆర్ఎంబీకి లేఖ రాశాం

పోలవరం- నల్లమల్ల సాగర్ ప్రాజెక్టులను వ్యతిరేకిస్తున్నాం

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి

పోలవరం- నల్లమల్ల సాగర్ ప్రాజెక్టులను తాము అన్ని ఫోరమ్‌లలో వ్యతిరేకిస్తున్నామని తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. మాజీ మంత్రి హరీశ్‌రావు చూపిస్తున్న లేఖ ఈ ప్రాజెక్టులకు సంబంధించినది కాదని క్లారిటీ ఇచ్చారు.



## మహిళల ఆర్థిక స్వావలంబన కోసం కృషి

ఉచిత బస్సుతో మహిళలకు దక్కిన భరోసా

ప్రతి మహిళను సభ్యురాలుగా చేర్చాలన్నదే లక్ష్యం

ఇందిరమ్మ క్యాంటీన్ల కోసం వడ్డీలేని రుణాలు

అసెంబ్లీ ప్రశ్నోత్తరాల్లో సీతక్క సమాధానం



హైదరాబాద్, జనవరి 5 :మహిళా సాధికారతకు సంక్షేమానికి తమ ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే ఉచిత బస్సు ప్రయాణాన్ని

-మిగతా 2 లో..

## కవిత వ్యాఖ్యల ఆధారంగా చర్యలు తీసుకోవాలి

రేవంత్ రెడ్డికి బిజెపి అధ్యక్షుడి సూచన

పార్టీ పెట్టాలనుకోవడం ఆమె వ్యక్తిగతం అని వ్యాఖ్య

హైదరాబాద్, జనవరి 5 : తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పార్టీ స్థాపించే అంశం ఆమె వ్యక్తిగతమని టీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లో బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు మాట్లాడుతూ.. రాజకీయ పార్టీ పెట్టే స్వేచ్ఛ అందరికీ ఉంటుందని పేర్కొన్నారు.



-మిగతా 2 లో..



## వ్యక్తిగా వెళుతున్నా..
# శక్తిగా తిరిగి వస్తా

(మొదటిపేజీ తరువాయి)

చేశారు. ఒక వ్యక్తిగా బయటకు వెళ్తున్నానని.. బలమైన శక్తిగా మళ్లీ చట్ట సభల్లోకి వస్తానంటూ కవిత శపథం చేశారు. తన రాజీనామాను ఆమోదించాలంటూ మండలి ఛైర్మన్‌కు కవిత విజ్ఞప్తి చేశారు. సెప్టెంబర్ 3న ఛైర్మన్ ఫార్మాట్‌లో రాజీనామా చేశానని తెలిపారు. సోమవారం నాడు తెలంగాణ శాసనమండలి సమావేశాలకు కవిత హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రసంగించిన ఆమె.. ఇదే తన చివరి ప్రసంగం అంటూ కన్నీరు పెట్టుకున్నారు. ఇదే సమయంలో తన రాజకీయ భవిష్యత్‌పై, తాను ఎదుర్కొన్న పరిస్థితులపై, బీఆర్ఎస్ పార్టీపై హాట్ కామెంట్స్ చేశారు. బీఆర్ఎస్ పార్టీపై ఊహించని రీతిలో విరుచుకు పడ్డారు కవిత. తన కింద నాయకులు చేస్తోన్న దురాగతాలను కేసీఆర్ గమనించడం లేదన్నారు. టీఆర్ఎస్ పేరును బీఆర్ఎస్‌గా మార్చటాన్ని తాను అంగీకరించ లేదన్నారు. తెలంగాణలో ఏం సాధించిందని.. బీఆర్ఎస్ జాతీయ రాజకీయాలకు వెళ్లిందంటూ తీవ్ర వ్యాఖ్యలతో విరుచుకుపడ్డారు. బీజేపీ తనను జైలుకు పంపితే.. బీఆర్ఎస్ నాయకులు తనకు అండగా నిలవలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఒంటరిగా మూడేళ్లు ఈడీతో తాను పోరాటం చేశానన్నారు. పార్టీ అధినేత కేసీఆర్‌ను విమర్శిస్తే పెద్ద నాయకులు ఎందుకు మాట్లాడటం లేదంటూ కవిత సూటిగా ప్రశ్నించారు. కేసీఆర్‌ను కాపాడుకోలేని పార్టీ ఉంటే ఎంత? పోతే ఎంత? అని అన్నారు. హరీష్ రావు అవినీతి పరుడంటూ కవిత ఉద్ఘాటించారు. బీఆర్ఎస్ పార్టీ రాజ్యాంగం పెద్ద జోక్ అని సెటైర్లు వేశారు. పార్టీ నడిపే పద్ధతి ఇది కాదని.. నైతికత లేని పార్టీ బీఆర్ఎస్ అంటూ శాసనమండలి సాక్షిగా దుమ్మెత్తిపోశారు. కనీసం సంజాయిషీ కూడా అడగకుండా తనను సస్పెండ్ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.. 'నా ఇద్దరి కొడుకుల మీద ఒట్టు వేసి చెప్తోన్న.. బీఆర్ఎస్‌తో నాది ఆస్తుల పంచాయితీ కాదు.. ఆత్మగౌరవ పంచాయితీ' అని కవిత స్పష్టం చేశారు. 'ప్రశ్నిస్తే.. బీఆర్ఎస్ పార్టీలోని కొందరు నాపై కక్ష కట్టారు. బీఆర్ఎస్ పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం లేదు. పదవుల కోసం బీఆర్ఎస్ పార్టీలోకి పోలేదు. పార్టీలో.. ప్రభుత్వంలో అవినీతిని ప్రశ్నించాను. సిద్దిపేట, సిరిసిల్లలో కట్టిన కలెక్టరేట్లు ఒక్క వర్షానికే మునిగిపోయాయి. ఉద్యమకారులకు ఆర్థికసాయం చేద్దామంటే నా మాట వినలేదు. ఇసుక దందాల కోసమే నేరెళ్ళ దురాగతం జరిగింది. తెలంగాణ వచ్చాక కూడా బోధన్ షుగర్ ఫ్యాక్టరీ తెరవకపోవటం అవమానకరం. సొంత సంస్థ జాగృతి ద్వారా తెలంగాణ ఉద్యమంలో పనిచేసి గుర్తింపు సంపాదించుకున్నాను. బీఆర్ఎస్ పార్టీ కాంగ్రెస్‌లో విలీనం కావాల్సిన పరిస్థితి ఉంది. ఉద్యమకారులు మాటలు కేసీఆర్‌కు చేరనివ్వటం లేదు. నిజామాబాద్ ఎంపీ టికెట్ కోసం బీఆర్ఎస్‌ను అడుక్కోలేదు. ఉద్యమంలో పార్టీలకు అతీతంగా కష్టపడ్డాను. తెలంగాణ జాగృతి సంస్థతో రాజకీయాల్లోకి వచ్చాను. బతుకమ్మ పండుగను ముందుకు తీసుకెళ్ళాను. నీళ్ళ విషంలో గత పాలకులు చేస్తోన్న తప్పునే.. ప్రస్తుత పాలకులు చేస్తున్నారు.' అంటూ సంచలన కామెంట్స్ చేశారు కవిత. ప్రత్యేక రాష్ట్రంగా తెలంగాణ ఏర్పడిన తర్వాత 2014లో జాగృతి ఆధ్వర్యంలో బతుకమ్మ నిర్వహించామని.. ఆ తర్వాత నుంచి తనపై ఆంక్షలు మొదలయ్యాయని ఎమ్మెల్సీ కవితఅన్నారు. వ్యక్తి స్వేచ్ఛను ఎలా హరిస్తారనే బాధ, ఆవేదనతో ఈ మాటలు చెబుతున్నట్లు తెలిపారు. శాసన మండలిలో ఆమె మాట్లాడుతూ భావోద్వేగానికి గురై కంటతడి పెట్టుకున్నారు. పార్టీ, ప్రభుత్వంలో జరిగిన అవినీతిని ప్రశ్నించా. అమరువీరుల స్తూపం మొదలు కలెక్టరేట్ల వరకు అన్ని నిర్మాణాల్లోనూ అవినీతి జరిగింది. ఒక్క వర్షానికే సిద్దిపేటలో కలెక్టరేట్ కొట్టుకుపోయింది. తెలంగాణ ఉద్యమకారులకు పింఛను ఇవ్వాలని పార్టీలో కోరాను. అమరవీరులను బీఆర్ఎస్ ఎప్పుడూ గుర్తించలేదు. నీళ్లు, నిధులు, నియామకాలనూ పట్టించుకోలేదు. బోధన్ షుగర్ ఫ్యాక్టరీని తెరిపించాలని ఎన్నోసార్లు అడిగాను. ఆ పరిశ్రమ తెరిపించలేకపోవడం నాకు అవమానకరం. కేసీఆర్‌ను అడిగే ధైర్యం నాకే ఉందని ఎన్నో విషయాలు అడిగా. కాళేశ్వరం విషయంలో ఆయనపై వచ్చిన ఆరోపణలపై పార్టీలో ఉన్న ఒక్క పెద్ద నాయకుడు కూడా మాట్లాడలేదు. అందుకే ప్రెస్‌మీట్ పెట్టి బలంగా మాట్లాడాను. అవినీతిపరుల పేరు చెప్పాను'అని కవిత అన్నారు. ఈ క్రమంలో కవిత కీలక ప్రకటన చేశారు. రాష్ట్రంలో కొత్త రాజకీయ వేదిక రాబోతోందని చెప్పారు. రాజకీయ పార్టీగా తెలంగాణ జాగృతి మారుతుందని ఆమె ప్రకటించారు. 'ఉద్యమ ద్రోహులకు బీఆర్ఎస్ రాజకీయ పునరావాస కేంద్రంగా మారింది. రాష్ట్రంలో ఓ కొత్త రాజకీయ వేదిక రాబోతోంది. విద్యార్థులు, నిరుద్యోగులు, అన్నివర్గాల కోసం పనిచేస్తా. అవమానభారంతో పుట్టింటి నుంచి అన్ని బంధనాలు తెంచుకుని మీకోసం వస్తున్నా.. ఆశీర్వదించండి. తెలంగాణ జాగృతి.. రాజకీయ పార్టీగా మారుతుంది. వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తాం. కచ్చితంగా గొప్ప రాజకీయ శక్తిగా ఎదుగుతా. వ్యక్తిగా సభ నుంచి వెళ్తున్నా.. రాజకీయ శక్తిగా తిరిగివస్తా' అని కవిత వ్యాఖ్యానించారు.

## కవిత వ్యాఖ్యల ఆధారంగా
# చర్యలు తీసుకోవాలి

(మొదటిపేజీ తరువాయి)

బీఆర్ఎస్, హరీష్‌రావు, కేటీఆర్‌పై కవిత ఆరోపణల ఆధారంగా ఎందుకు చర్యలు తీసుకోవట్లేదంటూ సీఎం రేవంత్ రెడ్డిని ఆయన సూటిగా ప్రశ్నించారు. అందుకు సంబంధించిన ఆధారాలు ఇవ్వడానికి కవిత సిద్ధంగా ఉన్నా.. చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా లేదన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య అంతర్గత ఒప్పందం కుదిరిందని ఆయన పేర్కొన్నారు. బీఆర్ఎస్‌ను కాపాడుతోంది.. సీఎం రేవంత్‌రెడ్డేనని బీజేపీ చీఫ్ రాంచందర్ రావు ఆరోపించారు. బీఆర్ఎస్, బీజేపీలు రెండు ఒక్కటే అనడం ఎమ్మెల్సీ కవిత అవగాహనా లోపమని తెలిపారు. సోమవారం నాడు శాసన మండలికి కల్వకుంట్ల కవిత హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె కీలక వ్యాఖ్యలు చేశారు. మండలిలో తనది ఇదే చివరి ప్రసంగమని కన్నీరు పెట్టుకున్నారు. ఒక వ్యక్తిగా బయటకు వెళ్తున్నానని.. బలమైన శక్తిగా తాను మళ్లీ చట్ట సభల్లోకి వస్తానంటూ కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. తన రాజకీయ భవిష్యత్‌తోపాటు తాను ఎదుర్కొన్న పరిస్థితులు, బీఆర్ఎస్ పార్టీపై కవిత హాట్ కామెంట్స్ చేశారు. తన రాజీనామాను ఆమోదించాలంటూ మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డికి ఈ సందర్భంగా కవిత విజ్ఞప్తి చేశారు.

## 'గోదావరి జల వివాదం'పై
# కూర్చుని మాట్లాడుకోండి..

(మొదటిపేజీ తరువాయి)



సంఘం ఇచ్చిన ఆదేశాలను కూడా ఏపీ పట్టించుకోవడం లేదు అని సింఘ్వీ వాదించారు. ఈ ప్రాజెక్టుపై తక్షణమే స్టే ఇవ్వాలని కోరారు. ఏపీ తరఫున ముకుల్ రోహిత్గీ వాదనలు వినిపిస్తూ.. ఈ ప్రాజెక్టు ఇంకాప్రాథమిక దశలోనే ఉందని, కేవలం డీపీఆర్, సర్వేల కోసం మాత్రమే టెండర్లు పిలుస్తున్నా మని ఆయన స్పష్టం చేశారు. నా ఇల్లు నేను కట్టుకుంటే పక్కవారికి అభ్యంతరం ఏంటీ అనే ఆసక్తికరమైన ఉదాహరణతో రోహత్గి తన వాదన వినిపించారు. రాయలసీమ వంటి కరవు ప్రాంతాలకు నీటిని అందించడమే తమ లక్ష్యమని ఇందులో ఎలాంటి ఉల్లంఘనలు లేవని స్పష్టం చేశారు. సముద్రంలోకి వృథాగా పోతున్న జలాలను వాడుకోవడమే తమ ఉద్దేశమని తెలిపారు. ఇరు వర్గాల వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం మధ్యవర్తిత్వం ద్వారా సమస్యను పరిష్కరించుకునే అవకాశాలను పరిశీలించాలని సూచిస్తూ తదుపరి విచారణను వచ్చే సోమవారానికి వాయిదా వేశారు. అయితే ఏపీ ఉల్లంఘనలకు పాల్పడటానికి సిద్ధమైందనేది ఆరోపణ అని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు. కమిటీ ఏర్పాటు చేశారని మీరే చెబుతున్నారని, అన్ని విషయాలపై నివేదిక ఇవ్వనీయండని తెలంగాణ తరఫు న్యాయవాది అభిషేక్ సింఘ్వీకి సుప్రీంకోర్టు సూచించింది. సివిల్ సూట్‌లో జోక్యం చేసుకుని నిలుపుదల చేసే అధికారం సుప్రీంకోర్టుకు ఉందా? అని సీజేఐ ప్రశ్నించారు. ఈ సందర్భంగా తమకు మధ్యంతర ఉపశమనం కల్పించాలని సింఘ్వీ కోరారు. ఏపీ కేవలం ప్రాజెక్టు నివేదిక కోసమే టెండర్లు పిలవాలని చూస్తోందని సీజేఐ అన్నారు. జాతీయ ప్రాజెక్టుల విషయంలో కేంద్రానికి న్యాయ పరిధి ఉంటుందన్నారు. మధ్యవర్తిత్వం ద్వారా ఎందుకు పరిష్కరించుకోకూడదని సీజేఐ సూచించారు. ఆంధ్రప్రదేశ్ తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి వాదనలు వినిపించారు. భవిష్యత్తులో చేపట్టే ప్రాజెక్టు నివేదికపై అభ్యంతరం ఏంటి? నా ఇల్లు - నేను కట్టుకోవాలనుకుంటే మీకు అభ్యంతరం ఏంటి? నా భూభాగంలో చేపట్టే ప్రాజెక్టు నివేదిక తయారు చేసుకుంటే అభ్యంతరం ఎందుకో? సీమలో కరవు ప్రాంతానికి నీటిని తీసుకెళ్లడానికే ప్రాజెక్టు ప్రతిపాదన. ఎక్కడా.. ఏ ఉత్తర్వులు, తీర్పులు ఉల్లంఘనలు ఈ ప్రాజెక్టులో లేవు' అని రోహత్గి వాదించారు. పరివాహక ప్రాంత రాష్ట్రాల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోవాలని ఈ సందర్భంగా సీజేఐ సూచించారు. అయితే, ఈ ప్రాజెక్టు వల్ల ఏ ఒక్క రాష్ట్రానికి నష్టం జరగదని ముకుల్ రోహత్గి వాదించారు. తెలంగాణ మాత్రం గోదావరిపై వందల ప్రాజెక్టుల నిర్మిస్తోందని ఏపీ తరఫున మరొక న్యాయవాది జగదీప్ గుప్తా వాదనలు వినిపించారు. ఇరు వాదనలు విన్న సుప్రీంకోర్టు తదుపరి విచారణను ఈ నెల 12కు వాయిదా వేసింది. అందరి అభిప్రాయాలతోనే తదుపరి విచారణ కొనసాగిస్తామని సీజేఐ వెల్లడించారు.

## రాష్ట్రంలో విస్తృతంగా
# అందుబాటులోకి సోలార్ పవర్

(మొదటిపేజీ తరువాయి)



చేశారు. గృహ అవసరాలకే కాకుండా వ్యవసాయ రంగానికి కూడా సోలార్ విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహించాలన్న లక్ష్యంతో పలు ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. శాసన మండలిలో ఈ అంశంపై మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం సూర్య ఘర్ పథకానికి ప్రజల నుంచి అనుకున్నంత స్థాయిలో స్పందన రావడం లేదని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే ఉచిత విద్యుత్ అందిస్తున్న నేపథ్యంలో సోలార్ ప్యానెల్స్ కోసం ఇంటి మీద రూఫ్ ఏర్పాటు చేయాల్సి రావడం కూడా ప్రజలు వెనకడుగు వేయడానికి కారణమవుతోందని చెప్పారు. పీఎం కుసుమ్ పథకాన్ని మరింత ప్రభావవంతంగా అమలు చేయాలనే ఉద్దేశంతో కొడంగల్, బొనకల్ మండలాల్లో పైలట్ ప్రాజెక్ట్‌గా సోలార్ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని భట్టి విక్రమార్క వెల్లడించారు. ఈ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం నుంచి కొంత సబ్సిడీ అందుతుందని, మొత్తం పథకం వ్యయం సుమారు రూ.519 కోట్ల రూపాయలు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి రెడ్కో నోడల్ ఏజెన్సీగా పనిచేస్తోందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 52 లక్షల కుటుంబాలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, అదేవిధంగా 20 లక్షల విద్యుత్ కనెక్షన్లను పీఎం సూర్య ఘర్ పథకంతో అనుసంధానం చేయాలనే అంశంపై కేంద్ర ప్రభుత్వాన్ని కలిసి చర్చించామని తెలిపారు. స్వయం సహాయక సంఘాలకు పొలాల్లో సోలార్ యూనిట్లు ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం ఉన్నప్పటికీ, లీజు భూముల్లో ఈ సదుపాయం కల్పించలేమని కేంద్ర నిబంధనలు స్పష్టం చేస్తున్నాయని డిప్యూటీ సీఎం భట్టి చెప్పారు. ఈ కారణంగా రైతులు కూడా పీఎం కుసుమ్ పథకంపై పెద్దగా ఆసక్తి చూపించడం లేదన్నారు. అయినప్పటికీ సాధ్యమైనంత వరకు ఈ పథకాలను అమలు చేసి సోలార్ విద్యుత్ వినియోగాన్ని పెంచేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని చెప్పారు. ఈ అంశాన్ని కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు బీజేపీ సభ్యులు సహకరించాలని కోరారు. 'ట్రాన్స్ ఫార్మర్స్, వ్యవసాయ పంపు సెట్ల కోసం రైతులు దరఖాస్తు చేసుకున్నారు. 3,48,462 మంది దరఖాస్తు చేసుకున్నారు. 75 పైచిలుకు ట్రాన్స్ ఫార్మర్స్ మంజూరు చేశాం. విద్యుత్ శాఖలో చాలా సంస్కరణలు తీసుకు వచ్చాము. 1912 కు ఫోన్ చేస్తే ఎలక్ట్రికల్ అంబులెన్స్ ద్వారా ఫిర్యాదు చేసిన ప్రాంతానికి వెళ్లి సమస్య పరిష్కారం చేస్తారు. అడిగిన వారికి ట్రాన్స్ ఫార్మర్స్ ఇస్తున్నాం. గత కొంతకాలంగా విద్యుత్ శాఖలో ప్రజా బాట నిర్వహించి సమస్యలు పరిష్కరిస్తున్నాం. గత ఏడాది 56807 బూటఇ పరిధిలో కొత్త కనెక్షన్లు, ఎన్పిడీసీఎల్లో 41 086 కనెక్షన్లు.. మొత్తంగా 97893 కొత్త కనెక్షన్లు ఇచ్చాము. ఈ ఏడాదిలో మరో 20 వేల కొత్త కనెక్షన్లు ఇస్తాం. రాష్ట్రంలో ట్రాన్స్ ఫార్మర్స్ కొరత లేదు' అని డిప్యూటీ సీఎం చెప్పారు.

## పోలవరం- నల్లమల్ల సాగర్ ప్రాజెక్టులను వ్యతిరేకిస్తున్నాం

**హైదరాబాద్, జనవరి 5:** పోలవరం- నల్లమల్ల ఇంటర్ స్టేట్ రూల్స్‌కు వ్యతిరేకమని జీఆర్ఎంబీకి తామే లేఖ రాశామని ప్రస్తావించారు. తమ అభిప్రాయాన్ని జీఆర్ఎంబీ కూడా సమర్థించిందని గుర్తుచేశారు. సోమవారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడారు. పోలవరం- నల్లమల్ల ప్రాజెక్టును మహారాష్ట్ర, కర్ణాటక కూడా వ్యతిరేకిస్తున్నాయని తెలిపారు. సుప్రీంకోర్టులో తెలంగాణ వాదనలను బలంగా వినిపించాలని న్యాయవాది అభిషేక్ సింఘ్వీకి సూచించామని పేర్కొన్నారు. ఈ కేసును వచ్చే సోమవారానికి సుప్రీంకోర్టు వాయిదా వేసిందని తెలిపారు. రిట్ పిటిషన్‌లో కాదని.. సూట్ పిటిషన్‌లో రావాలని తమకు సుప్రీంకోర్టు సూచించిందని అన్నారు. ఈ కేసులో స్టే ఇవ్వాలని సుప్రీంకోర్టును వచ్చే సోమవారం కోరుతామని తెలిపారు. వచ్చే విచారణకు తాను కూడా ప్రత్యక్షంగా హాజరవుతానని స్పష్టం చేశారు. ఒకటి, రెండు రోజుల్లో మరోసారి న్యాయవాదులతో సమావేశం అవుతామని వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే రాయలసీమ ఎత్తిపోతల పథకం నిలిపివేశారని స్పష్టం చేశారు. గతంలో ఈ పథకం ఆగిపోయి ఉంటే బీఆర్ఎస్ ప్రభుత్వం ఎందుకు చెప్పలేదని ప్రశ్నల వర్షం కురిపించారు. తమ ఒత్తిడి వల్లే ఏపీ ప్రభుత్వం రాయలసీమ ఎత్తిపోతల పథకం పనులు ఆపేసిందని తేల్చిచెప్పారు. బీఆర్ఎస్ హయాంలో కృష్ణ- గోదావరి జలాల్లో తెలివి ఎక్కువ.. పని తక్కువ అని చెప్పుకొచ్చారు. అతి తెలివితో బీఆర్ఎస్ తెలంగాణకు భారీ నష్టం చేసిందని ధ్వజమెత్తారు. కేసీఆర్ హయాంలో పాలమూరు - రంగారెడ్డిని జూరాల నుంచి శ్రీశైలానికి మార్చి, తుమ్మిడిహెట్టి నుంచి మేడిగడ్డకు కాళేశ్వరాన్ని మార్చి భారీ నష్టం చేశారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# తెలంగాణలో విద్యావ్యవస్థ చిన్నాభిన్నం



**హైదరాబాద్, జనవరి 5 :** ప్రతి విద్యార్థికి 5 లక్షల భరోసా కార్డు ఇస్తామని గాలికొదిలేశారని, ఫీజు రీయంబర్స్ మెంట్ రాక కాలేజీలు మూతపడుతున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజు రీయంబర్స్ మెంట్ కోసం తాము మద్దతిచ్చినా కొన్ని కాలేజీ యాజమాన్యాలు మాత్రం ప్రభుత్వానికి భయపడి రాజీ పడుతున్నాయన్నారు. ఫీజు రీయంబర్స్ మెంట్ విషయంలో విద్యార్థులను ఇబ్బంది పెడితే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. రాష్ట్రంలో విద్యా సమస్యలపై ఏబీవీపీ చేస్తున్న ఉద్యమాలు ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్ శంషాబాద్ లోని ఎస్సాస్సార్ కన్వెన్షన్ లో సోమవారం ఏబీవీపీ 44వ రాష్ట్ర మహాసభలకు కేంద్ర మంత్రి బండి సంజయ్ హాజరయ్యారు. ఈ సభలకు రాష్ట్ర విద్యార్థి పరిషత్ అధ్యక్షులు హెచ్ సీయూ ప్రొఫెసర్ రావుల క్రిష్ణ, కార్యదర్శి రాంబాబు, కర్నె రామచందర్, గీతాసింగ్, భీమనపల్లి శ్రీకాంత్ హాజరైన ఈ కార్యక్రమంలో నల్గొండ జిల్లా పానగల్ కు చెందిన సామాజిక కార్యకర్త, హెచ్ఐవీ బాధితులకు, వారి పిల్లలకు అనేక రకాలుగా సేవలందిస్తున్న భీమనపల్లి శ్రీకాంత్ కు 'జనమంచి గౌరీశంకర్ జీ యువ పురస్కార్ ను' కేంద్ర మంత్రి అందజేశారు. అనంతరం మహాసభలను ఉద్దేశించి బండి సంజయ్ ప్రసంగం చేశారు. ఏబీవీపీ 44వ రాష్ట్ర మహాసభల సందర్భంగా 'జనమంచి గౌరీశంకర్ జీ' యువ పురస్కార్ కార్యక్రమంలో పాల్గొనడం ఆనందంగా ఉంది. జనమంచి గౌరీశంకర్ జీ వ్యక్తి. విద్యార్థులకు ఐకాన్. ఇంటిపేరును సార్థకం చేసుకున్న జనం మనిషి గౌరీజీ. ఏబీవీపీయే ఆయన జీవితం. బాల్యం నుండి చనిపోయేదాకా ఏబీవీపీకే సిద్ధాంతాలకే అంకితమైన నాయకుడు. ఉమ్మడి ఏపీలో విద్యార్థి పరిషత్ ను అంచెలంచెలుగా ఎదిగేలా చేసిన వ్యక్తి గౌరీజీ. విద్యార్థి నాయకులకు శిక్షణ కార్యక్రమాలకు అధిక ప్రాధాన్యం ఇచ్చారు. క్యాపిటేషన్ ఫీజులకు వ్యతిరేకంగా, విద్యా రంగ సమస్యల పరిష్కారం కోసం అనేక రూపాల్లో పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహించారు. 1983లో నక్సల్స్‌కు వ్యతిరేకంగా తొలి ఉద్యమం ప్రారంభించిన ఏబీవీపీ నాయకుడు గౌరీశంకర్ జీ. ఉగ్రవాదంపై కూడా విద్యార్థులను చైతన్యం చేశారు. ఆర్టికల్ 370 రద్దు, అయోధ్యలో రామ మందిర నిర్మాణం కోసం పోరాడారని బండి సంజయ్ గుర్తు చేశారు. ఏబీవీపీ కార్యకర్తలు, బీజేపీ నాయకులు, జనసంఘ్ నాయకులు మాత్రమే 370 ఆర్టికల్ కోసం పోరాడారు. శ్యామాప్రసాద్ ముఖర్జీ వంటి వారు బలిదానం చేశారు. వారి త్యాగాలు వృథా పోకూడదనే మోదీ ప్రభుత్వం 370 ఆర్టికల్ ను రద్దు చేశారు. అట్లాగే అయోధ్య రామమందిరంలో కరసేవకుల త్యాగాలు, బలిదానాలు వృధా కావొద్దని రామ మందిరాన్ని నిర్మించిన ఘనత మోదీ ప్రభుత్వానిదేనని అన్నారు. ఈ దేశంలో ఎలాంటి సమాజం నిర్మాణం కావాలో ఒక్కసారి ఆలోచించాలని కోరుతున్నా. పదేళ్ల బీఆర్ఎస్, రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో క్లాస్ రూముల్లో చీకటి రాజ్యమేలుతోంది. స్కూళ్లో టీచర్ లేడు. టాయిలెట్లు లేవు. బెంచ్ లు లేవు. అయినా ఈ ప్రభుత్వానికి సిగ్గు కూడా లేదు. ఒక ప్రభుత్వం విఫలమైతే ఒక ఎన్నిక పోతుంది. విద్య విఫలమైతే ? ఒక తరం పోతుంది! కాంగ్రెస్ రెండేళ్ల పాలనతో రెండు తరాలు నష్టపోయేంతగా విద్యా వ్యవస్థ ఛిన్నాభిన్నమైందని అన్నారు. కాంగ్రెస్ ను గెలిపించిన పాపానికి వేలాది టీచర్ పోస్టులు ఇంకా ఖాళీగా ఉన్నాయి. స్కావెంజర్స్ లేక ఊడ్చేవాడు లేక స్కూళ్లు అల్లాడుతున్నాయి. టీచర్లు, సౌకర్యాల్లేక పోవడంతో ఒక్క ఏడాదిలోనే (2024-25 విద్యా సంవత్సరంలో) రాష్ట్రంలో 2 వేల 81 ప్రభుత్వ పాఠశాలల్లో ఒక్క విద్యార్థి కూడా చేరలేదు. బీఆర్ఎస్ పాలనలో మూసివేసిన 6 వేల పాఠశాలలను తెరిపిస్తామని ప్రగల్భాలు పలికిన కాంగ్రెస్ పార్టీ?అధికారంలోకి వచ్చాక ఆ పని చేయకపోగా.. దాదాపు 1500 స్కూల్స్ ను మూసివేశారు. ప్రతి విద్యార్థికి 5 లక్షల భరోసా కార్డు ఇస్తామన్నారు. పోస్ట్ కార్డు కూడా ఇయ్యలే. ప్రతి విద్యార్థికి ఇంటర్నెట్, వైఫై సౌకర్యం కల్పిస్తామన్నారు. కరెంట్, నీళు,, సరైన తిండికి దిక్కులేక హాస్టల్ విద్యార్థులు అల్లాడుతూ ఫుడ్ పాయిజన్ తో వందలాది మంది చనిపోతున్నా గాలికొదిలేసినోళ్లు ఇంటర్నెట్ సౌకర్యం కల్పిస్తామని చెప్పడం సిగ్గు చేటన్నారు. 18 ఏళ్లు దాటిన యువతులకు స్కూటీ ఇస్తామన్నారు. ఊసే లేదు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు టెన్త్ పాసైతే రూ.15 వేలు, ఇంటర్ చేస్తే రూ.25 వేలు, డిగ్రీ చేస్తే రూ.50 వేలు, పీజీ చేస్తే రూ.లక్ష ఇస్తామని మేనిఫెస్టోలో హామీ ఇచ్చి మోసం చేశారని బండి విమర్శలు గుప్పించారు. గత నాలుగేళ్లుగా ఫీజు రీయంబర్స్ మెంట్ నిధులు చెల్లించకపోవడంతో దాదాపు రూ.10 వేల కోట్ల బకాయిలు పేరుకుపోయాయి. ఫలితంగా గత మూడేళ్లలో వందలాది కాలేజీలు మూతపడ్డాయి. ప్రైవేట్ కాలేజీ యాజమాన్యాలు పలుమార్లు నావద్దకు వచ్చినా వారికి మద్దతుగా పోరాటం చేస్తానని చెప్పిన. ఫీజు రీయంబర్స్ మెంట్ కోసం మేం యుద్ధం చేస్తుంటే.. కాలేజీ యాజమాన్యాలు వెనకడుగు వేసి రాజీపడి విద్యార్థులను ఇబ్బంది పెడుతున్నాయి. ఏబీవీపీ మద్దతిస్తే రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయంబర్స్ మెంట్ పై దిగొస్తుందని కాలేజీ యాజమాన్యాలే చెబుతున్నాయంటే? ఏబీవీపీ అంటే ఏమిటో అర్థం చేసుకోవాలి. దురదృష్టవశాత్తు ఏబీవీపీ చేసే ఉద్యమాలను ప్రజల్లోకి వెళ్లడం లేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఏడాది వ్యవధిలో 2 లక్షల ఉద్యోగాలు భర్తీ భర్తీ చేస్తామని చేయలేదు. ప్రకటించిన జాబ్ క్యాలెండర్ అమలు చేయడం లేదు. నిరుద్యోగులకు నెలకు రూ.4 వేల చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తామని ఇప్పటివరకు ఇవ్వలేదు. ప్రతి జిల్లాకు రెసిడెన్షియల్ స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి, సాంపుల్ ఇంప్లిమెంటేషన్‌కే పరిమితమయ్యింది. ప్రైవేటు సెక్టారులోని ఉద్యోగాల్లో తెలంగాణ యువతకు 75 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని చెప్పి మాట తప్పిందని కేంద్రమంత్రి విమర్శించారు. విద్యా రంగంలో ఇన్ని సమస్యలున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యా రంగాన్ని మొత్తం భ్రష్టు పట్టిస్తోంది. గౌరీ శంకర్ జీ స్ఫూర్తితో పెద్ద ఎత్తున పోరాటాలకు నడుం బిగించాల్సిందిగా ఈ రాష్ట్ర మహాసభల వేదికిగా ఏబీవీపీ నాయకులను కోరుతున్నా. అని బండి సంజయ్ అన్నారు.

# మాతృభాషే మన శ్వాస కావాలి

- అమ్మ భాషను మరచిపోవడం సరికాదు
- తెలుగు మహాసభల్లో వెంకయ్యనాయుడు



**గుంటూరు, జనవరి 5 :** తెలుగు భాష సజీవంగా ఉంచేందుకు ఎంతో మంది కృషి చేశారని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు కొనియాడారు. మనమంతా తెలుగువారమై ఉండికూడా తెలుగు మాట్లాడక పోవడం సరికాదన్నారు. తెలుగు అమ్మ భాషని అన్నారు. గుంటూరులో మూడో తెలుగు మహాసభల్లో ఆయన పాల్గొన్నారు. గొప్పవారంతా తమ మాతృభాషలో చదువుకొనే ఉన్నత స్థానాలకు చేరుకున్నారని వెంకయ్యనాయుడు తెలిపారు. రామాయణ కాలంలోనూ తెలుగు భాష ఉందని ఇటీవల కొన్ని ఆధారాలను గుర్తించారని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. 'నన్నయ్య, తిక్కన్న, వేమన, కందుకూరి వీరేశలింగం, గురజాడ అప్పారావు, గిడుగు రామ్మూర్తి, ఉన్నవ లక్ష్మీనారాయణ, సురవరం ప్రతాపరెడ్డి, ఎన్టీ రామారావు, రామోజీరావు.. ఇలా చాలా మంది మహనీయులు తెలుగు భాష ఉన్నతి కోసం శ్రమించారు. తెలుగువారు అయ్యుండి తెలుగు మాట్లాడకపోతే ఏదో లోపం ఉన్నట్లే లెక్క. అమ్మ అంటే అంతరాళం నుంచి వస్తుంది. అదే మమ్మీ అంటే నోటి నుంచి మాత్రమే వస్తుంది. మాతృభూమిని, మాతృదేశాన్ని, మాతృమూర్తిని మ-రచినవారు పరిపూర్ణ మానవుడు కాదు. ఈతరంలో తెలుగు భాష నేర్చుకోవాల్సిన అవసరం లేదని తల్లిదండ్రులు భావిస్తున్నారు. గుడి, బడి, అమ్మ ఒడిలో మాతృభాషనే మాట్లాడాలన్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ కూడా మాతృభాషలోనే చదువుకున్నారు. మాతృభాషను మరిచిపోతే శ్వాస పోయినట్టే. తెలుగు భాషను కాపాడుకోవాలంటే తెలుగులో మాట్లాడితే చాలు. తెలుగు భాషాభిమానులు, కవులు, రచయితలు, కళాకారులు చేసిన త్యాగాన్ని గుర్తించాలి. ఇతర దేశాల్లో సాంకేతిక విద్య, ఇతర విద్యా కోర్సులు వారి మాతృభాషలోనే ఉంటున్నాయి. మన దేశంలోనూ ప్రధాని మోదీ మాతృభాషలోనే సాంకేతిక కోర్సులు అందుబాటులోకి తీసుకురాను న్నారు. స్థానిక ప్రభుత్వాలు కూడా మాతృభాషలోనే ఉత్తర్వులు ఇవ్వాలి. తెలుగు రాష్ట్రాల్లో పరిపాలనా భాషగా తెలుగు అమలు చేయాలి. న్యాయస్థానాల్లో తెలుగు భాషను అమలు చేస్తే చాలా బాగుంటుందని వెంకయ్య నాయుడు తెలిపారు.



## ఐనవోలు బ్రహ్మోత్సవాలకు సిఎంకు ఆహ్వానం

**హైదరాబాద్,జనవరి5 :** ఐనవోలు మల్లికార్జున స్వామి వారి బ్రహ్మోత్సవాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆహ్వానం పలికారు. సిఎంను సోమవారం కలిసిన మంత్రులు కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలు ఆహ్వానపత్రం అందచేశారు. ఈసందర్భంగా ఐనవోలు పూజారులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆశీర్వచనం అందించారు.

## అమెరికాలో రోడ్డు ప్రమాదంలో దంపతుల మృతి

**పాలకొల్లుకు చెందిన దంపతుల మృతితో కుటుంబంలో విషాదం**

**భీమవరం, జనవరి 5 :** అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎపికి చెందింన దంపతులు దుర్మరణం చెందారు. రోడ్డు ప్రమాదంలో పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లుకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కొటికలపూడి కృష్ణ కిషోర్ అనియాస్ టిన్ను, అతని భార్య ఆశ మృతి చెందిన ఘటన పాలకొల్లులో విషాదాన్ని నింపింది.. అమెరికా, వాషింగ్టన్ రాష్ట్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఈ దంపతులు దుర్మరణం పాలయ్యారు.. కొటికలపూడి కృష్ణ కిషోర్, గత దశాబ్దం కాలంగా అమెరికాలో సాఫ్ట్‌వేర్ రంగంలో ఇంజనీర్ గా పని చేస్తున్నారు. కృష్ణ కిషోర్ ఇటీవల 10 రోజుల క్రితం గ్రామానికి వచ్చి తిరిగి అమెరికాకు వెళ్ళినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పలు నెలల పాటు కుటుంబంతో కలిసి ఉన్న వారు తిరుగు ప్రయాణంలో భాగంగా దుబాయ్‌లో న్యూ ఇయర్ వేడుకలు జరుపుకొని ప్రయాణం కొనసాగించారు. దురదృష్టకరంగా, ప్రయాణంలో ఉన్న సమయంలో వారి కారుకు ప్రమాదం జరిగినట్లు తెలిసింది. ఈ ప్రమాదంలో కృష్ణ కిషోర్ భార్య ఆశ ప్రాణాలు విడిచారు.. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్న వారి కుమారుడు మరియు కుమార్తె ప్రస్తుతం వైద్యంలో ఉన్నారని కుటుంబం వెల్లడించారు..

## ఇరాన్‌లో హింసాత్మక నిరసనలు

**అప్రమత్తంగా ఉండాలని విదేశాంగ శాఖ హెచ్చరిక**

**న్యూఢిల్లీ, జనవరి 5 :** ఇరాన్‌లో హింసాత్మక నిరసనలు చోటుచేసుకుంటున్నందున భారత పౌరులు ఆ దేశానికి ప్రయాణాలు మానుకోవాలని కేంద్ర విదేశాంగ శాఖ సోమవారంనాడు అడ్వయిజరీ జారీ చేసింది. ఇరాన్‌లోని భారత పౌరులు తగిన జాగ్రతలు తీసుకోవాలని, నిరసన ప్రదర్శనలు జరిగే ప్రాంతాలకు దూరంగా ఉండాలని, స్థానిక అధికారులు, వార్తా సంస్థల అప్‌డేట్స్‌ను ఎప్పుటికప్పుడు ఫాలో కావాలని సూచించింది. అలాగే టెహ్రాన్‌లోని భారత రాయబార కార్యాలయం అధికారిక వెబ్‌సైట్, సోషల్ మీడియా ఛానెల్స్ నుంచి సమాచారం చెక్ చేసుకోవాలని విజ్ఞప్తి చేసింది. రెసిడెంట్ వీసాపై ఇరాన్‌లో ఉంటున్న భారత పౌరులు ఇప్పటికే భారత రాయబార కార్యాలయంలో రిజిస్టర్ కాకపోతే వెంటనే చేసుకోవాలని కూడా ఎంఈఏ సూచించింది. ఇరాన్‌లో ఆర్థిక సంక్షోభం తలెత్తడంతో ప్రజల్లో నిరసన అంతకంతకూ తీవ్రమవుతోంది. పెద్ద సంఖ్యలో ప్రజలు వీధుల్లోకి వచ్చి ఆందోళనలు చేస్తుండటంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొంటున్నాయి.

## ప్రియుడి మోజులో భర్తను కడతేర్చిన భార్య

**నిజామాబాద్, జనవరి 5 :** మాక్లూర్ మండలం బొర్గాంలో దారుణ ఘటన వెలుగు చూసింది. ప్రియుడి మోజులో పడి భార్య కట్టుకున్న భర్త ను నిర్దాక్షిణ్యంగా ఉరేసి చంపింది. స్థానికంగా ఈ ఘటన తీవ్ర కలకలం రేపింది. పట్టాటి రమేశ్(35) భార్య సౌమ్య ఓ ప్రైవేట్ స్కూల్లో ఉద్యోగం చేస్తుంది. అదే స్కూల్‌లో పీఈటీ గా పనిచేస్తున్న దిలీప్‌తో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం కాస్త వివాహేతర సంబంధానికి దారి తీసింది. ఈ విషయం భర్త రమేశ్ కి తెలియడంతో ఇద్దరికీ గట్టి వార్నింగ్ ఇచ్చాడు. ఈ క్రమంలోనే తన భర్త అడ్డు తొలగించుకోవాలని నిర్ణయించుకుంది సౌమ్య. గత నెల 20న తన ప్రియుడు దిలీప్‌తో కలిసి రమేష్‌ని ఇంట్లోనే టవల్‌తో ఉరేసి హత్య చేసింది. అనంతరం ఏమీ తెలియనట్లుగా తన భర్త గుండెపోటుతో చనిపోయాడని బోరున విలపిస్తూ ఎవరికీ అనుమానం రాకుండా అందరినీ నమ్మించి హడావుడిగా అంత్యక్రియలు పూర్తి చేసింది. అంత్యక్రియల సమయంలో గ్రామస్థులు రమేశ్ మెడపై గాట్లు ఉండటం గమనించారు. అనుమానం వచ్చి వెంటనే ఇజ్రాయెల్‌లో ఉంటున్న అతని తమ్ముడు కేదారికి సమాచారం అందించారు. కేదారి వెంటనే అప్రమత్తమై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అసలు గుట్టు బయటపడింది. పోలీసులు మృతదేహాన్ని వెలికితీసి విచారింగా.. తమ అక్రమ సంబంధానికి అడ్డు వస్తున్నాడన్న కారణంతోనే హత్య చేసినట్లు రమేశ్ భార్య సౌమ్య ఒప్పుకుంది. ఈ కేసులో పోలీసులు సౌమ్యతో పాటు మరో ఐదుగురు నిందితులను అరెస్ట్ చేశారు. పదమూడేళ్ల వైవాహిక బంధం, ముగ్గురు పిల్లలు ఉన్నారన్న కనీస జ్ఞానం లేకుండా మధ్యలో వచ్చిన ప్రియుడి కోసం భర్తను అన్యాయంగా చంపిన సౌమ్యకు కఠినమైన శిక్ష పడాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

# మహిళా సాధికారితకు పెద్దపీట

(మొదటిపేజీ తరువాయి)

ప్రారంభించామని తెలిపారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం ద్వారా మహిళల ఆర్థిక స్వావలంబన కోసం కృషి చేస్తున్నామన్నారు. మహిళా సాధికారత, సంక్షేమమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి మహిళల అభివృద్ధికి పెద్దపీట వేస్తూ కీలక నిర్ణయాలు తీసుకుంటున్నామని తెలిపారు. తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు నాలుగవ రోజు ప్రారంభమయ్యాయి. సభ మొదలైన వెంటనే స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రశ్నోత్తరాలను చేపట్టారు. ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ఏర్పాటుపై సభ్యులు ప్రశ్న లేవనెత్తగా.. మంత్రి సీతక్క సమాధానం ఇచ్చారు. ప్రతి మహిళ ఎస్‌జీహెచ్ సభ్యురాలుగా ఉండాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని వెల్లడించారు. 15 సంవత్సరాలు దాటిన బాలికల నుంచి పండు ముదుసలి వరకు మహిళా సంఘం సభ్యులుగా చేర్చుతున్నామని తెలిపారు. కిశోర బాలికలు, వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక మహిళా స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేస్తున్నామని మంత్రి సీతక్క పేర్కొన్నారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 250 ఇందిరమ్మ క్యాంటీన్లు ఏర్పాటు చేశామని తెలంగాణ మంత్రి సీతక్క తెలిపారు. క్యాంటీన్ల నిర్వహణ, పెట్టుబడి కోసం స్వయం సహాయక సంఘాల సభ్యులకు వడ్డీలేని రుణాలు ఇస్తున్నట్లు చెప్పారు. స్వయం సహాయక సంఘాల సభ్యులకు 10 రోజులపాటు హైదరాబాద్‌లో శిక్షణ ఇచ్చామన్నారు. పట్టణ ప్రాంతాల్లో 130 క్యాంటీన్లు చేసినట్లు వివరించారు. కోటిమంది మహిళలను కోటీశ్వరులను చేయాలనేది సీఎం రేవంత్‌రెడ్డి సంకల్పమని చెప్పారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని అమలు చేశామని మంత్రి సీతక్క గుర్తు చేశారు. ఇది మహిళలకు భద్రతతో పాటు ఆర్థికంగా ఉపశమనాన్ని కలిగించే కీలక నిర్ణయమని పేర్కొన్నారు. మహిళల రోజువారీ జీవనాన్ని సులభతరం చేయడమే లక్ష్యంగా ఈ పథకాన్ని ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం ద్వారా మహిళల ఆర్థిక స్వావలంబన కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని మంత్రి సీతక్క చెప్పారు. మహిళలు స్వయం ఉపాధి సాధించేందుకు అవసరమైన అవకాశాలు, వనరులు కల్పిస్తూ వారి ఆర్థిక బలాన్ని పెంచడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని వివరించారు. 15 సంవత్సరాలు దాటిన బాలికల నుంచి వృద్ధ మహిళల వరకు అందరినీ మహిళా సంఘాల్లో సభ్యులుగా చేర్చుతున్నామని తెలిపారు. ఈ విధంగా మహిళలందరినీ ఒక వ్యవస్థలోకి తీసుకువచ్చి అభివృద్ధి పథంలో నడిపించడమే లక్ష్యమన్నారు. అదేవిధంగా కిశోర బాలికలు, వృద్ధులు, దివ్యాంగ మహిళల కోసం ప్రత్యేక మహిళా స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేస్తున్నామని మంత్రి వెల్లడించారు. వీరి అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక కార్యక్రమాలు రూపొందించి.. వారికి ఆర్థిక, సామాజిక భద్రత కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. అయితే సోమవారం కూడా బీఆర్ఎస్ సభకు దూరంగా ఉండాలని నిర్ణయించింది. శాసనసభ, శాసనమండలి సమావేశాలకు హాజరుకావొద్దని బీఆర్ఎస్ నిర్ణయం తీసుకుంది. సభలో ప్రతిపక్షానికి మాట్లాడే అవకాశం ఇవ్వటంలేదని.. అందుకు నిరసనగా బీఆర్ఎస్ అసెంబ్లీని బహిష్కరించిన విషయం తెలిసిందే.

# దేవుడిని కూడా వదలకపోవడం దారుణం

**శబరిమల బంగారం మాయం కేసులో సుప్రీం వ్యాఖ్య**




**న్యూఢిల్లీ, జనవరి 5 :** శబరిమల బంగారం తాపడాల కేసులో సోమవారం సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. దేవుడినీ వదిలిపెట్టలేదంటూ ట్రావెన్‌కోర్ దేవస్వమ్ బోర్డు మాజీ సభ్యుడు శంకర్‌దాస్ పిటిషన్‌ను కొట్టివేసింది. కనీసం దేవుడు, ఆలయం జోలికివెళ్లకుండా ఉండాల్సిందని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ కేసులో శంకర్‌దాస్ కూడా బాధ్యులేనని పేర్కొంది. ప్రముఖ శబరిమల ఆలయంలో బంగారం అదృశ్యం వ్యవహారంపై దర్యాప్తు జరుగుతోంది. 2019లో బంగారం పూత పూసిన రాగి రేకులను ఎలక్ట్రో ప్లేటింగ్ కోసం స్మార్ట్ క్రియేషన్స్ సంస్థకు అప్పగించారని కేరళ హైకోర్టుకు సిట్ వెల్లడించింది. ఆ ప్లేట్ల మొత్తం బరువు 42.100 కేజీలు కాగా ఎలక్ట్రోప్లేటింగ్ ప్రక్రియ పూర్తయిన తర్వాత వాటిపై ఉండే బంగారంలో కొంత అదృశ్యమైంది. ఈ కేసులో ప్రధాన నిందితుడు ఉన్నికృష్ణన్ పొట్టి దానిని ప్రైవేటుగా మళ్లించాడని ఆరోపించింది. ఎలక్ట్రోప్లేటింగ్ అనంతరం ఉన్నికృష్ణన్ తనకు 474.90 గ్రాముల బంగారం ఇచ్చాడని గోవర్ధన్ అనే మరో నిందితుడు తెలియజేసి ఆమేరకు సిట్‌కు ఇప్పటికే బంగారం అప్పగించాడు. ఈ కేసు విచారణలో భాగంగా గతంలో బోర్డు మాజీ సభ్యుడు శంకర్‌దాస్‌పై కేరళ హైకోర్టు తీవ్రవ్యాఖ్యలు చేసింది. నేరపూరిత కుట్ర ఆరోపణల నుంచి తప్పించుకోలేరని మండిపడింది. హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల్లో తనకు వ్యతిరేకంగా ఉన్న తీవ్ర వ్యాఖ్యలను తొలగించాలని కోరుతూ తాజాగా అతడు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అయితే న్యాయస్థానం ఆ పిటిషన్‌ను తోసిపుచ్చింది. ఇక ఈ కేసులో దర్యాప్తు పూర్తిచేయడానికి సిట్‌కు కేరళ హైకోర్టు మరో ఆరువారాల గడువు ఇచ్చింది. జనవరి 19న ప్రత్యేక దర్యాప్తు బృందం మధ్యంతర నివేదికను న్యాయస్థానానికి సమర్పించనుంది.

## కన్నతండ్రిని కన్నీరు పెట్టిస్తున్న కవిత

- కవితను ఎవరో వెనక నుంచి నడిపిస్తున్నారు
- ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత ఘాటు విమర్శలు

**హైదరాబాద్, జనవరి 5 :** బీఆర్ఎస్ పార్టీలో ఎమ్మెల్సీ కవిత వ్యవహారం ఇప్పుడు తీవ్ర రాజకీయ దుమారం రేపుతోంది. కవిత ఇటీవల చేసిన వ్యాఖ్యలపై ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత ఘాటుగా స్పందించారు. కవిత మాటలు బీఆర్ఎస్ పార్టీకి పెను ఇబ్బందిగా మారాయని, ఆమె ఎవరో వెనుక ఉండి ఆడిస్తుంటే కీలుబొమ్మగా మారి ఇలా మాట్లాడుతున్నారని ఆరోపించారు. ముఖ్యంగా కేసీఆర్ ని కంటతడి పెట్టిస్తూ, ఆయనను మానసిక క్షోభకు గురి చేస్తున్న వైనాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని సునీత స్పష్టం చేశారు. పార్టీ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు ఎమ్మెల్యేలందరూ అసెంబ్లీని బహిష్కరిస్తే, కవిత మాత్రం భిన్నంగా వ్యవహరించడం వెనుక ఉన్న మతలబు ఏమిటని ఆమె నిలదీశారు. కవిత తన ఎమ్మెల్సీ పదవికి చేసిన రాజీనామా కేవలం ఒక నాటకమని, ఆమె మనస్ఫూర్తిగా ఆ పని చేయలేదని సునీత ఎద్దేవా చేశారు. ఒకవేళ నిజంగానే పదవి అవసరం లేదనుకుంటే కౌన్సిల్ సమావేశాలకు ఎందుకు హాజరయ్యారని ప్రశ్నించారు. అసలు పార్టీలో స్వేచ్ఛ లేకపోతే కవిత ఇన్ని పదవులు ఎలా పొందగలిగారని, ఓడిపోయి నప్పటికీ కేసీఆర్ ఆమెకు ఎమ్మెల్సీగా గౌరవప్రదమైన అవకాశం కల్పించిన విషయాన్ని మర్చిపోకూడదని హితవు పలికారు. పార్టీలో కవితకు ఉన్నంత చనువు మరెవరికీ లేదని, అలాంటిది ఇప్పుడు పార్టీని డ్యామేజ్ చేసేలా మాట్లాడటం కూర్చున్న కొమ్మను నరుక్కున్న చందంగా ఉందని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్ర సమితిని బీఆర్ఎస్ పార్టీగా మార్చడం ఇష్టం లేదంటున్న కవిత, మరి తన సొంత సంస్థ అయిన తెలంగాణ జాగృతిని 'భారత జాగృతి'గా ఎలా మార్చారని సునీత నిలదీశారు. ఇది ఆమె ద్వంద్వ వైఖరికి నిదర్శనమని, కంకణం కట్టుకుని మరీ బీఆర్ఎస్ పార్టీని ఆగం చేయాలని కవిత చూస్తున్నారని ఆరోపించారు. లిక్కర్ కేసులో కవిత ఇరుక్కున్నప్పుడు హరీష్ రావు , కేటీఆర్ వారానికి నాలుగు సార్లు ఢిల్లీకి తిరిగి ఆమె కోసం ఎంతో శ్రమించారని, కానీ ఇప్పుడు ఆమె మాత్రం పార్టీకి వెన్నుపోటు పొడిచేలా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపక్షాలకు కనీస సమయం ఇవ్వని ప్రభుత్వం, కవితకు మాత్రం అంత సమయం ఎలా కేటాయించిందో చూస్తుంటే ఆమెను ఎవరు నడిపిస్తున్నారో స్పష్టంగా అర్థమవుతోందని, ఇకపై ఆమె ఆటలు సాగవని గొంగిడి సునీత హెచ్చరించారు.

## కుటుంబ కలహాలతో దంపతుల ఆత్మహత్య

**హైదరాబాద్, జనవరి 5 :** కుటుంబ కలహాలు రెండు నిండు ప్రాణాలను బలితీసుకున్నాయి. భార్యాభర్త వేర్వేరు ప్రాంతాల్లో ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా ఐలాపూర్ చిన్న తండాలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్నూలు జిల్లాకు చెందిన లాల్ శేఖర్ (32) తన భార్య అనూషతో కలిసి రెండేళ్లుగా ఐలాపూర్ చిన్న తండాలో దోబీ పని చేసుకుంటూ ఉండేవారు. ఇద్దరి మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. ఆదివారం కూడా భార్యాభర్త మధ్య గొడవ జరిగింది. దీంతో అనూష సమీపంలో ఉండే తల్లిగారింటికి వెళ్లిపోయింది. సోమవారం తన పుట్టింట్లోనే ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ విషయం తెలుసుకున్న భర్త లాల్ శేఖర్ వెళ్లి తలుపు పగలగొట్టి వెళ్లి చూడగా అప్పటికే ఆమె ప్రాణాలు విడిచింది. దీంతో తనకు ఏం జరుగుతుందోనని ఆందోళనతో తానుండే ఇంటికి వెళ్లి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. లాల్ శేఖర్, అనూష మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## పోలీస్ స్టేషన్ ఎదుట యువకుడి ఆత్మహత్యాయత్నం

**హైదరాబాద్, జనవరి 5 :** గచ్చిబౌలి పోలిస్ స్టేషన్ ముందు పవన్ అనే యువకుడు ఆత్మహత్యకు యత్నించిన ఘటన కలకలం రేపింది. తనకు న్యాయం చేయాలని పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో పురుగుల మందు తాగి పవన్ ఆత్మహత్యకు యత్నించాడు. పవన్?ను గచ్చిబౌలి పోలీసులు కొండాపుర్ హస్పిటల్‌కు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో కొండాపుర్ హాస్పిటల్ నుంచి గాంధీ ఆసుపత్రికి తరలించారు. గచ్చిబౌలి గోపన్ పల్లి లో పవన్ నివాసం ఉంటున్నాడు. చిట్టీ విషయంలో పవన్, అతని స్నేహితుడి మధ్య గొడవ జరిగింది. గొడవ కారణంగా గచ్చిబౌలి పోలీస్ స్టేషన్?కు పవన్, అతని స్నేహితుడు వెళ్లారు. ఈ క్రమంలోనే పవన్ ఆత్మహత్యకు యత్నించాడు. గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## బంగ్లా ఘటనలను క్రికెట్‌కు ముడిపెట్టవద్దు

- హసీనాను వెనక్కి పంపండి
- ఎంఐఎం అధినేత ఓవైసీ డిమాండ్



**హైదరాబాద్, జనవరి 5 :** బంగ్లాదేశ్‌లో హిందువులపై మారణకాండలు జరుగుతున్న నేపథ్యంలో బీసీసీఐ ఓ కీలక నిర్ణయం తీసుకుంది. కోల్‌కతా నైట్ రైడర్స్ టీమ్ నుంచి ముస్తాఫిజుర్ రెహ్మాన్‌ను రిలీవ్ చేయాలని దాని సహ యజమాని బాలీవుడ్ స్టార్ షారుఖ్ ఖాన్‌కు ఆదేశాలు జారీ చేసింది. బీసీసీఐ తీసుకున్న ఈ నిర్ణయాన్ని కొంతమంది రాజకీయ నాయకులు తప్పుబడుతున్నారు. కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ రాజకీయాలను, క్రీడలను కలపొద్దని హితవు పలికారు. ఇప్పుడు ఎమ్ఐఎమ్ పార్టీ అధినేత అసదుద్దీన్ ఓవైసీ.. రెహ్మాన్‌కు మద్దతుగా నిలిచారు. అసదుద్దీన్ ఓవైసీ మాట్లాడుతూ.. 'పహల్గామ్ దాడి తర్వాత మనం పాకిస్థాన్‌తో ఏషియా కప్ క్రికెట్ ఆడాము. మీరు బంగ్లాదేశ్ పేసర్‌ను వెనక్కు పంపించేశారు. ఓ బంగ్లాదేశీ మహిళ ఇండియాలో నివసిస్తోంది. ఆమెను కూడా వెనక్కు పంపండి. ఎందుకు ఆమెను ఇండియాలోనే నిలిపి వేశారు? బంగ్లాదేశ్‌లో స్థిరత్వం ఇండియాకు ముఖ్యం. చైనా, పాకిస్థాన్ బంగ్లాదేశ్‌లో యాక్టీవ్‌గా ఉన్నాయి. మనం దాని గురించి కూడా బాగా ఆలోచించాలి' అని అన్నారు. కాగా, బంగ్లాదేశ్‌లో 2024 జులై, ఆగస్టు నెలల్లో జరిగిన మారణహోమానికి కారణం అప్పటి ప్రధాని షేక్ హసీనానేనంటూ ఆమెను ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రిబ్యునల్-1 దోషిగా తేల్చింది. హసీనాకు మరణ శిక్ష విధించింది. హసీనాకు మరణ శిక్ష వేయడాన్ని ఆమె కుటుంబసభ్యులు తీవ్రంగా తప్పుబట్టారు. రాజకీయ కుట్రలో భాగంగానే ఇంతకు తెగించారని మండిపడ్డారు. తన తల్లి ఇండియాలో క్షేమంగా ఉంటుందని ఆమె కుమారుడు సజీబ్ వాజెద్ జోయ్ స్పష్టం చేశాడు.

## నిలదీస్తామన్న పారిపోయారు

- చర్చ పెడితే తోకముడిచారు
- బిఆర్ఎస్ గైర్హాజరుపై మండిపడ్డ మంత్రులు భట్టి, శ్రీధర్ బాబు

**హైదరాబాద్, జనవరి 5 :** ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీస్తామని బీఆర్ఎస్ నాయకులు ఎందుకు అసెంబ్లీ నుంచి జారుకున్నారని శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు ప్రశ్నించారు. ప్రభుత్వాన్ని నిలదీస్తామని బీరాలు పలికిన ఎమ్మెల్యేలు.. ఇప్పుడు సభ నుంచి తోకముడిచారని ఎద్దేవా చేశారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సభాపతిని అవమానపరిచేలా వ్యవహరించిన బీఆర్ఎస్ సభ్యులపై చర్యలు తీసుకోవాలని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌కు విజ్ఞప్తి చేశారు. బీఏసీ సమావేశంలో యక్ష ప్రశ్నలు వేసిన ఆ పార్టీ నాయకులు.. ఇప్పుడు అసలు కనిపించట్లేదన్నారు. "శాసన సభలో ముఖ్యమైన అంశాలపై చర్చ జరిగే సమయంలో ప్రధాన ప్రతిపక్ష సభ్యులు గైర్హాజరు కావడం సరికాదు. వాస్తవాలను ప్రజల ముందు ఉంచేందుకే ప్రభుత్వం సభలో కృష్ణా జలాలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఏర్పాటు చేసింది. దీనిపై అభ్యంతరాలు ఉంటే సభలో చెప్పాలి కానీ, బయట చెప్పడం సమంజసం కాదు'అని మంత్రి శ్రీధర్‌బాబు చెప్పారు. ఇకపోతే బీఏసీలో అన్ని అంశాలపై చర్చించాలని భారత రాష్ట్ర సమితి పట్టుబట్టిందని, వారి కోరిక మేరకు అన్ని అంశాలపై చర్చ పెడుతున్నట్లు తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. అయితే, పాలమూరు - రంగారెడ్డిపై చర్చ పెడితే బీఆర్ఎస్ నాయకులు అసెంబ్లీ భయపడిపోయారని భట్టి విమర్శించారు. ఇబ్బంది అయిన రోజున వాకౌట్ చేశారంటే ఫర్వాలేదు కానీ.. మిగతా రోజులు ఎందుకు సభకు రాలేదని ప్రశ్నించారు. ఉపాధి హామీ పథకంపై చర్చ బీఆర్ఎస్‌కు ముఖ్యం కాదా? అని ఎద్దేవా చేశారు. సభ ఎన్ని రోజులు నడపాలనేది స్పీకర్ పరిధిలోని అంశమని తెలిపారు. బీఏసీకి చెందిన ఏ నిర్ణయమైనా స్పీకర్ పరిధిలోనే ఉంటుందన్నారు. మండలిలో ఎమ్మెల్సీ కవిత భావోద్వేగానికి లోనైంది నిజమేనని, ఆమె ఏం మాట్లాడారో రికార్డు అయ్యాయని తెలిపారు.

## సాహితీ ఇన్‌ఫ్రాటెక్ మోసం 3వేల కోట్లు

**ప్రీ లాంచ్ పేరుతో ప్రజలకు కుచ్చుటోపి**

**హైదరాబాద్, జనవరి 5 :** రియల్ ఎస్టేట్ పేరిట భారీ మోసానికి పాల్పడ్డ సాహితీ ఇన్‌ఫ్రాటెక్ వెంచర్స్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. సెంట్రల్ క్రైమ్ స్టేషన్ పోలీసులు నాలుగేళ్ల విచారణ అనంతరం మొత్తం రూ. 3000 కోట్ల రూపాయల స్కామ్‌గా దీనిని తేల్చారు. ప్రీ లాంచ్ ఆఫర్' పేరుతో అతి తక్కువ ధరకు ప్లాట్లు ఇస్తామంటూ వేలాది మంది కస్టమర్ల నుంచి డబ్బులు వసూలు చేసి మోసం చేశారు సాహితీ యాజమాన్యం. ఈ కేసులో మొత్తం 64 కేసులు నమోదయ్యాయి. ముఖ్యంగా అమీన్‌పూర్‌లోని శర్వాణి ఎలైట్ ప్రాజెక్ట్‌కు సంబంధించి 17 కేసులు ఉన్నాయి. ఈ 17 కేసుల్లో రూ. 500 కోట్లు పైగా వసూలు చేసినట్లు పోలీసులు గుర్తించారు. కంపెనీ యాజమాన్యంలోని సాహితీ లక్ష్మీనారాయణ వసూలు చేసిన డబ్బులను సొంత ప్రయోజనాలకు ఉపయోగించారని ఆరోపణలు ఉన్నాయి. మొత్తం 13 మంది నిందితులపై అభియోగాలు నమోదు చేసిన అఅ÷ూ టీం, పలు కేసుల్లో ఛార్జ్‌షీట్ దాఖలు చేసింది. ఈ స్కాం వల్ల వేలాది మంది మధ్యతరగతి కుటుంబాలు ఆర్థికంగా నష్టపోయాయి. బాధితులు గతంలో ధర్నాలు, నిరసనలు చేశారు. పోలీసుల విచారణ కొనసాగుతోంది. మిగతా కేసుల్లోనూ త్వరలో ఛార్జ్‌షీట్ దాఖలు చేస్తామని అధికారులు తెలిపారు.

# సవాళ్లతో ఎంతకాలమీ మోసాలు!



**ప్రభుత్వాలు నడపడమంటే సవాళ్లు విసురుకోవడంలా ఉంది. కృష్ణా,గోదావరి జలాలపై తెలంగాణలో రాజకీయం తారాస్థాయికి చేరింది. అసెంబ్లీలో ప్రభుత్వం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తే.. దానిని బహిష్కరించి, అసెంబ్లీకి రాకుండాపోయిన బిఆర్ఎస్ ఆదివారం ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఎవరి కోసం అన్నది చెప్పాలి. అసెంబ్లీలో చర్చించాల్సిన విషయంపై పార్టీ ఆఫీసులో కూర్చుని కాకమ్మ కబుర్లు చెప్పడం ఎవరిని మోసం చేయడానికి అన్నదే ప్రశ్న. అదే విషయం అసెంబ్లీలో ఎందుకు చెప్పలేక పోయారు. గత పదేళ్లలో చేసిన దుర్మార్గాలను కప్పిపుచ్చి, తెలంగాణ ప్రజలక చేసిన ద్రోహాన్ని మరచి పోయి, తెలంగాణను దోచుకుని అప్పలకుప్ప చేసిన బిఆర్ఎస్ ముందు.. పదేళ్ల పాపాలపై చర్చించాలి. ప్రజలకు సమాధానం చెప్పాలి. తప్పులు చేయడం, అప్పలు చేయడం సవాళ్లు విసురుకోవడం అన్నది పరిపాటిగా మారింది. ఇది కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీ వ్యవహారం కాదు. ఇది తెలంగాణ ప్రజల వ్యవహారం.**

ఇరు పార్టీలు సవాళ్లతో సాగడం వల్ల నష్టపోయేది ప్రజలు తప్ప వీరు కాదని గుర్తించాలి. ఉచిత పథకాలు, సంక్షేమం పేరుతో ఖజానాను లూటీ చేయడంలో ఇద్దరూ పోటీ పడ్డారు. అప్పుడు బిఆర్ఎస్, ఇప్పుడు కాంగ్రెస్ పోటీ పడుతూనే ఉంది. రాష్ట్రంలో కనీసం కొత్తగా రోడ్లు లేకున్నా దెబ్బతిన్న రోడ్డు వేయకుండా చోద్యం చూస్తున్నారు. కాళేశ్వరం, దరణి, ఫోన్ ట్యాపింట్ కేసుల్లో రెండేళ్లు గడిచినా గుండుసూది మొనంత కూడా ముందుకు సాగడం లేదు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఆర్థిక పరిస్థితిపై అవగాహన లేకుండా హామీలు ఇచ్చి, ఇప్పుడు ఆ హామీలను అమలు చేయలేక దిక్కులు చూస్తోంది. దీంతో ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వంపై విరుచుకుపడుతున్నారు. అయితే, ఈ విషయంలో ఆ పార్టీని తప్పు పట్టాల్సింది కూడా లేదు. నాడు కేసీఆర్ అయినా, నేడు రేవంత్ రెడ్డి అయినా తమ సొంత ఆస్తులు అమ్మి పథకాలను అమలు చేయడం లేదు. అందుకే హామాలపైనా సవాళ్లు విసురుతున్నారు. ఈ ఇరువురు కూడా అప్పులు చేసి పథకాలను అమలు చేస్తున్న తీరు దారుణం కాక మరోటికాదు. జీతాలకు కూడా సక్రమంగా లేని దుస్థితికి తెలంగాణను తీసుకుని వచ్చారు.. అందుకే ప్రజలు కూడా గత కొన్నేళ్లుగా అమలవుతున్న పథకాలను తమ హక్కుగా భావిస్తున్నారు.

ఉచిత పథకాలకు ప్రజలు బానిసలు కావడంతో వీరి ఆటలు సాగుతున్నాయి. అధికారం నిలబెట్టుకోవడమే లక్ష్యంగా సంక్షేమ పథకాలు అమలు చేసి ప్రజలను బురిడీ కొట్టిస్తున్నారు. ఎన్నికల రేసులో వెనుకబడి పోకూడదని రాజకీయ పార్టీలు పథకాల ప్రకటనలో పోటీ పడుతున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో ఇది చూడవచ్చు. అప్పుల కారణంగా అవసరమైన మౌలిక వసతులు ఏమాత్రం మెరుగుపడ్డం లేదు. రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉంది. తెలంగాణకు అయినా, ఆంధ్రప్రదేశ్‌కు అయినా ఇంతకన్నా తలవంపు మరోటి ఉండదు. ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్మాణాలకు నిధులు ఉండవు. సంక్షేమ వసతి గృహాల మెస్ బిల్లులు కూడా సకాలంలో చెల్లించరు. దీంతో ఆహార నాణ్యత లోపిస్తోంది. ప్రభుత్వ ఆస్పత్రులలో సిబ్బంది కొరత ఉండనే ఉంది. అత్యవసరమైన మందులు ఉండవు. ఇలా చెప్పుకొంటూ పోతే లెక్కలేదు. ఇవన్నీ ఇప్పుడు అధికారం కోల్పోయిన బిఆర్ఎస్, వైకాపాలకు విమర్శల అస్త్రాలకుగా మారాయి. తాము అధికారంలో ఉన్నప్పుడు ఈ రంగాలను ఉద్ధరించినట్లు మాట్లాడుతున్నారు. ప్రభుత్వం ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలు కూడా పేరుకుపోతున్నాయి. పదవీ విరమణ సందర్భంగా ఉద్యోగులకు చెల్లించాల్సిన మొత్తాలను చెల్లించలేక పదవీ విరమణ వయసు పెంచుతున్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఇవే పరిస్థితులు దాపురించాయి. సూపర్ సిక్స్ అమలు చేయడం లేదుని కూటమిపై మాజీ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి ఒత్తిడి తెస్తున్నారు. నిన్నటిదాకా జగన్‌రెడ్డి అప్పులు చేయడం, తాకట్టు పెట్టడం చేశారు. ఇప్పుడు చంద్రబాబు అదే పని చేస్తారు. అంతిమంగా మునిగిపోయేది రాష్ట్రమే. చంద్రబాబు కంపెనీలుగానీ, జగన్‌రెడ్డి కంపెనీలుగానీ ఆ నష్టాలను భరించవు. ఈ ఇద్దరు తమ వ్యాపారాల నుంచి ప్రజలకు పంచరు. రెండు రాష్ట్రాల్లోనూ ప్రభుత్వాలు చెల్లించాల్సిన బకాయిలు లక్షల కోట్లకు చేరాయి. చిన్నా చితకా పనులు చేసిన వారు సకాలంలో బిల్లులు పొందలేక నలిగిపోతున్నారు. ఇప్పుడు బిల్లులు చెల్లించడానికి కూడా కమీషన్లు తీసుకోవడం ప్రారంభించారన్న విమర్శలు వస్తున్నాయి. ఒకరిద్దరు మంత్రులు అదేపనిగా వసూళ్ల దందాకు తెరలేపారని కేంద్రమంత్రి బండి సంజయ్ ఇటీవల ఆరోపించారు. వారిపై నిఘా పెట్టామన్నారు. సంక్షేమం పేరిట పంపకాలకు పాల్పడుతూ మరో వైపు అవినీతికి గేట్లు ఎత్తుతున్నారు. ఈ అవినీతి సొమ్ములో కొంత మొత్తాన్ని ఎన్నికల సమయంలో ప్రజలకు పంచుతున్నారు. రైతులకు ఉచిత విద్యుత్, ఫీజు రియంబర్స్‌మెంట్ చెల్లింపులు, ఆరోగ్యశ్రీ వంటి పథకాలు అమలు చేసినా ఫలితం దక్కడం లేదు.

అన్ని సంక్షేమ పథకాలు అమలు చేసినా, బటన్లు నొక్కినా 2024 ఎన్నికల్లో జగన్‌రెడ్డికి 11 సీట్లు మాత్రమే వచ్చాయి. తెలంగాణలో కేసీఆర్‌ను గానీ, ఆంధ్రప్రదేశ్‌లో జగన్‌రెడ్డిని గానీ సంక్షేమ పథకాలు కాపాడలేదు. ఈ వాస్తవాన్ని విస్మరించిన ఆంధ్రప్రదేశ్ ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 2024లో 'సూపర్ సిక్స్' పేరిట సరికొత్త హామీలు ఇచ్చారు. వృద్ధాప్య పెన్షన్ల మొత్తాన్ని ఏకంగా నాలుగు వేలకు పెంచారు. వాటిని పంచడానికి హెలికాప్టర్లు వేసుకుని ఊరేగుతున్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెడుతున్నారని కాంగ్రెస్ పార్టీ ఆరోపించగా, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులపాలు చేస్తోందని బీఆర్ఎస్ విమర్శిస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో కూడా నాడు జగన్మోహన్ రెడ్డి పది లక్షల కోట్లు అప్పులు చేశారని తెలుగుదేశం పార్టీ విమర్శించగా, ఇప్పుడు కూటమి ప్రభుత్వం చేస్తున్న అప్పులు చూసి జగన్ అండ్ కో గుండెలు బాదుకుంటున్నారు. ప్రభుత్వాలకు ఆదాయం ఇబ్బడి ముబ్బడిగా పెరిగి నిధులు మూలుగుతుంటే ప్రజలకు పంచి పెట్టడంలో తప్పు లేదు. కానీ అప్పులు చేసి పథకాలు అమలు చేయడం, చేయని వాటిపై సవాళ్లు విసరడం మామూలయ్యింది. సవాళ్ల ప్రజలను మభ్య పెట్టలేరు. ప్రజలు చైతన్యం అయితే తప్ప ఈ దుర్మార్గాల నుంచి బయటపడలేము.

# మరోమారు భారత్‌పై ట్రంప్ అక్కసు

## మరిన్ని టారిఫ్‌లు విధిస్తానంటూ హెచ్చరికలు

**వాషింగ్టన్, జనవరి 5 :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మ–రోసారి భారత్‌ను టార్గెట్ చేశారు. రష్యాతో భారత్ స్నేహంగా ఉండటాన్ని.. మరీ ముఖ్యంగా చమురు దిగుమతి చేసుకోవటాన్ని ట్రంప్ జీర్ణించుకోలేకపోతున్నారు. ఎలాగైనా రష్యా నుంచి భారత్‌ను దూరం చేయాలని భావిస్తున్నారు. అధిక సుంకాలు విధిస్తామంటూ బెదిరింపులకు దిగుతున్నారు. ఇప్పటికే భారత్‌నుంచి అమెరికాకు దిగుమతి అవుతున్న చాలా వస్తువులపై 50 శాతం టారిఫ్‌లు విధించారు. భారత వ్యాపారాన్ని దెబ్బ తీసేలా దారుణంగా వ్యవహరిస్తున్నారు. మరోసారి భారత్, రష్యా వాణిజ్య ఒప్పందాలపై ఆయన ఫైర్ అయ్యారు. మేరకు వైట్ హౌస్.. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు సంబంధించిన ఆడియోను సోమవారం మీడియాకు విడుదల చేసింది. ఆ ఆడియోలో ఏముందంటే..' అమెరికాతో భారత్ వాణిజ్య లావాదేవీలు కొనసాగిస్తోంది. భారత్ వాణిజ్య లావాదేవీలపై త్వరలో సుంకాలు పెంచుతా. భారత్ నన్ను సంతోషపెట్టాలని కోరుకుంటోంది. ప్రధాని మోదీ చాలా మంచి వ్యక్తి. నేను సంతోషంగా లేనని ప్రధాని మోదీకి తెలుసు. నన్ను సంతోషపెట్టడం భారత్‌కు చాలా ముఖ్యం' అని చెప్పుకొచ్చారు. కాగా, గతంలో భారత్‌పై అమెరికా 50 శాతం టారిఫ్‌లు విధించింది. ఇందులో 25 శాతం టారిఫ్‌లు కేవలం రష్యాతో ఆయిల్ దిగుమతి చేసుకుంటున్న కారణంగా విధించింది. డొనాల్డ్ ట్రంప్ చెబుతున్న దాని ప్రకారం అమెరికా అత్యధిక టారిఫ్‌లు వేసిన దేశాల్లో భారత్ ముందు వరుసలో ఉంది. రెండు దేశాల మధ్య సంబంధాలు దెబ్బతింటున్న నేపథ్యంలో బైలటెరల్ ట్రేడ్ అగ్రిమెంట్స్ (బీటీఏ) చేసుకోవాలని ఇండియా చూస్తోంది. అతి త్వరలో ఇందుకు సంబంధించిన అప్‌డేట్ వచ్చే అవకాశం ఉంది.



భారత్‌పై మరిన్ని టారిఫ్‌లు విధించనున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. రష్యా నుండి భారత్ చమురు కొనుగోళ్లు కొనసాగిస్తుండటంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. భారత్‌పై టారిఫ్‌లను మరింత పెంచనున్నట్లు తెలిపారు. ఎ÷–లోరిడా నుండి వాషింగ్టన్ డిసికి వెళ్లే మార్గంలో ఎయిర్‌ఫోర్స్ వన్ విమానంలో ఆదివారం మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. 'ప్రధాని మోడీ మంచి వ్యక్తి. నేను సంతోషంగా లేనని ఆయనకు తెలుసు. నన్ను సంతోషపెట్టడం ముఖ్యం. రష్యాతో వ్యాపారం కొనసాగిస్తే.. మేము మరిన్ని టారిఫ్‌లను విధిస్తాం' అని పేర్కొన్నారు. ట్రంప్ భారత్‌పై విధించిన టారిఫ్‌ల కారణంగానే భారత్ ఇప్పుడు రష్యన్ చమురు కొనుగోళ్లను గణనీయంగా తగ్గించిందని అమెరికా సెనెటర్ లిండ్సే గ్రాహం పేర్కొన్నారు. ఎయిర్‌ఫోర్స్ వన్‌లో ట్రంప్‌తో పాటు లిండ్సే గ్రాహం కూడా ఉన్నారు. రష్యన్ చమురు కొనుగోలు చేసే దేశాల దిగుమతులపై 500శాతం టారిఫ్‌లు విధించే టారిఫ్ బిల్లు గురించి గ్రాహం వెల్లడించారు. రష్యా–ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించాలంటే, రష్యా భాగస్వామ్యులపై ఒత్తిడి తీసుకురావాలని గ్రాహం పేర్కొన్నారు. ఆంక్షలు రష్యాను తీవ్రంగా దెబ్బతీస్తాయని అన్నారు. రష్యా చమురును కొనుగోలు చేసినందుకే భారత్‌పై అమెరికా 25శాతం సుంకం విధించిందని అన్నారు.

# అమెరికా దాడితో 40మంది పౌరుల మృతి

- విద్యుత్ వ్యవస్థ దెబ్బతినడంతో పలుచోట్ల అంధకారం
- వెనెజువెలా అధికార వర్గాలు వెల్లడి

**వాషింగ్టన్, జనవరి 5 :** వెనెజువెలాపై అమెరికా సైన్యం చేసిన దాడిలో కనీసం 40 మంది ప్రాణాలు కోల్పోయినట్లుగా వెనెజువెలాకు చెందిన ఓ సీనియర్ అధికారి వెల్లడించారు. మృతుల్లో సైనికులతో పాటు సాధారణ పౌరులు కూడా ఉన్నారని చెప్పారు. వెనెజువెలాపై భారీ దాడి అనంతరం అధ్యక్షుడు నికోలస్ మదురో, ఆయన సతీమణి సిలియా ఫ్లోరెస్‌ను అదుపులోకి తీసుకున్నట్లుగా పేర్కొన్నారు. కాగా, వెనెజువెలాపై చేసిన దాడిలో తమవైపు ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. కేవలం కొద్దిమంది మాత్రమే గాయపడ్డారని తెలిపారు. ఇది అత్యంత సంక్లిష్టమైన ఆపరేషన్ అని పేర్కొన్నారు. మన వైపు ప్రాణనష్టం లేకుండా ఇంత పెద్ద ఆపరేషన్ పూర్తి కావడం ఆశ్చర్యకరమని వ్యాఖ్యానించారు. ఈ దాడిలో అనేక విమానాలు, హెలికాప్టర్లు, ఫైటర్ జెట్లు పాల్గొన్నాయని వెల్లడించారు. సాధారణంగా చొరబడలేని ప్రాంతాల్లోకి ప్రవేశించి, ఈ క్లిష్టమైన ఆపరేషన్ నిర్వహించామని చెప్పారు. వెనెజువెలా ప్రజలకు స్వేచ్ఛ కల్పించడమే అమెరికా లక్ష్యమని ట్రంప్ స్పష్టం చేశారు. వెనెజువెలా దేశంపై దాడి చేసి అధ్యక్షుడు నికొలస్ మదురో, అతని భార్య సిలియా అగ్రరాజ్యం అమెరికా బందీగా పట్టుకుని న్యూయార్క్ నగరానికి తీసుకుపోయిన క్రమంలో ఆ దేశ రాజధాని కారకాస్, పొరుగున ఉన్న నగరాల్లో తీవ్ర భయం, ఆందోళన పరిస్థితులు నెలకొన్నాయి. ఆహారం కోసం పెద్దయెత్తున ప్రజలు బారులు తీరారు. పలు చోట్ల అంధకారం అలముకుంది. ప్రజా రవాణా వ్యవస్థ స్తంభించింది. ఏ క్షణంలో ఏం జరుగుతుందో అన్న భయంతో చాలామంది ఇండ్లకే పరిమితమై పోయారు. చాలా సూపర్‌మార్కెట్లు మూతపడ్డాయి. తెరిచి ఉంచిన చిన్నచిన్న దుకాణాల వద్ద 500–600 మంది బారులు తీరారు. ముఖ్యంగా ముందు జాగ్రత్తగా బ్రెడ్ దుకాణాల వద్ద జనం పెద్దయెత్తున చేరుకున్నారు. అలాగే మందుల షాపుల వద్ద కూడా ప్రజలు ఎక్కువగా కన్పించారు. ఔషధాలతో పాటు అక్కడ అమ్మే కేన్‌డ్



ఫుడ్‌ను వారు కొనుగోలు చేయడం కన్పించింది. ప్రజలు తమ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాల చార్జింగ్ కోసం ఎగబడ్డారు. కాగా, అక్కడ స్వల్ప సంఖ్యలో ఉన్న భారతీయ కమ్యూనిటీ కోసం భారత ఎంబసీ ఒక వాట్సాప్ గ్రూప్‌ను సృష్టించింది. దాని ద్వారా భారతీయులకు ఎప్పటికప్పుడు సూచనలు, ఆదేశాలు అందజేస్తున్నది. మెరికా దాడుల్లో పవర్ గ్రిడ్స్ దెబ్బ తినడంతో పలు ప్రాంతాల్లో విద్యుత్తు లేక అంధకారం అలముకుంది. కమ్యూనికేషన్ వ్యవస్థకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అమెరికా దళాలు కారకాస్ ఎయిర్‌పోర్టుపై కూడా దాడి చేయడంతో రాజధాని నుంచి 100 కి.మీ వరకు ఎలాంటి వైమానిక ప్రయాణ సౌకర్యం లేకుండా పోయిందని భారత సంతతికి చెందిన సునీల్ మల్హోత్రా అనే స్థానికుడు తెలిపారు. ప్రజలు ఆహారం కోసం అల్లాడుతున్నారని, షాపుల వద్ద పెద్దపెద్ద క్యూలు ఏర్పడ్డాయని, పౌరుల్లో భయం, అనిశ్చితి, ఆందోళన నెలకొందని చెప్పారు. ఫ్యూర్టే ట్యూయనా వద్ద అధిక నష్టం వాటిల్లిందన్నారు. కాగా, విద్యుత్తు స్తంభాల నుంచి అక్రమంగా వైర్లను లాగి కొందరు ఫోన్లకు చార్జింగ్ చేసే వ్యాపారం ప్రారంభించారు. ప్రస్తుత పరిస్థితులపై స్థానిక సంస్థలు కానీ, ప్రభుత్వం కానీ ప్రజలకు ఎలాంటి ప్రకటనలు, సూచనలు చేయలేదు. అధికారులు కూడా పూర్తి అనిశ్చితి పరిస్థితుల్లో ఉన్నారు. అయితే అక్కడక్కడ పోలీసులు పరిస్థితులను నియంత్రించడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో పౌరులు బయటకు రావడానికే భయపడుతున్నారని మల్హోత్రా తెలిపారు.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో హరీష్ రావుకు ఊరట

## ప్రభుత్వ పటిషన్ కొట్టివేసిన సుప్రీం ధర్మాసనం

**న్యూఢిల్లీ, జనవరి 5 :** ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీష్ రావుకు సుప్రీం కోర్టులో భారీ ఊరట లభించింది. ఈ కేసుకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన ఎస్ఎల్పీని సుప్రీం ధర్మాసనం డిస్మిస్ చేసింది. ఫోన్ ట్యాపింగ్ కేసులో హరీష్ రావును విచారించేందుకు అనుమతి ఇవ్వాలంటూ సుప్రీం కోర్టులో తెలంగాణ సర్కార్ పిటిషన్ దాఖలు చేసింది. ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది సిద్దార్థ్ లూథ్రా వాదనలు వినిపించారు. అయితే గతంలోనే తన ఫోన్‌ను ట్యాప్ చేయించారంటూ మాజీ మంత్రి హరీష్ రావుపై రియల్ ఎస్టేట్ వ్యాపారి చక్రధర్ గౌడ్ పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై ఎఫ్ఐఆర్ కూడా నమోదు అయ్యింది. దీన్ని సవాల్ చేస్తూ హరీష్ రావు తెలంగాణ హైకోర్టును ఆశ్రయించగా.. సరైన ఆధారాలు లేనందున ఈ కేసును కొట్టివేస్తూ హైకోర్టు తీర్పునిచ్చింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ తెలంగాణ ప్రభుత్వం సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై సోమవారం సుప్రీంలో విచారణ జరుగగా.. తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పులో జోక్యం చేసుకోబోమని జస్టిస్ బీవీ నాగరత్న ధర్మాసనం తేల్చిచెప్పింది. ఎస్ఎల్పీలో జోక్యం చేసుకునేందుకు సుప్రీం ధర్మాసనం నిరాకరించింది. రాధాకిషన్‌రావు, హరీశ్‌రావులకు వ్యతిరేకంగా ప్రభుత్వం వేసిన పిటిషన్లను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఈ వ్యవహారంలో గతంలో దాఖలైన పిటిషన్ను హైకోర్టు కొట్టివేసినట్లు జస్టిస్ బీవీ నాగరత్న ధర్మాసనం గుర్తుచేసింది. రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన ఆదేశాల్లో జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో హరీశ్‌రావు, రాధాకిషన్ రావు ఫోన్ ట్యాపింగ్ చేశారని సిద్దిపేటకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి చక్రధర్ గౌడ్ 2024లో పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు కూడా చేపట్టారు. అయితే ఈ ఎఫ్ఐఆర్‌ను క్వాష్ చేయాలని హరీశ్‌రావు అదే ఏడాది డిసెంబర్ 4న హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన ధర్మాసనం.. ఆ ఎఫ్ఐఆర్‌ను క్వాష్ చేస్తూ గత ఏడాది మార్చి 20వ తేదీన ఆదేశాలిచ్చింది. చక్రధర్ గౌడ్ ఫిర్యాదు ఆధారంగా నమోదైన ఎఫ్ఐఆర్‌పై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మళ్లీ జూన్ 18న సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దీనిపై విచారణ జరిపిన సర్వోన్నత న్యాయస్థానం.. ఆ పిటిషన్లను కొట్టివేసింది.

# పెరూ షామన్ల జ్యోతిష్యం నిజమయ్యిందా

- వెనెజువెలా దాడి గురించి ముందే చెప్పిన షామన్లు
- ఇప్పుడు సర్వత్రా ఇదే అంశంపై చర్చ

**పెరూ, జనవరి 5 :** వెనెజువెలాపై అమెరికా మెరుపు దాడులు, ఆ దేశ అధ్యక్షుడు నికోలస్ మదురోని అదుపులోకి తీసుకున్న అంశం ప్రపంచాన్ని షేక్ చేస్తోంది. రాత్రికి రాత్రే జరిగిన ఈ పరిణామంతో యావత్ ప్రపంచం షాక్ అయ్యింది. అయితే, ఈ ఆపరేషన్ గురించి ముందుగానే చెప్పారు పెరూలోని షామన్లు. అవును, ప్రపంచాన్ని షాక్‌కు గురి చేసిన ఈ అంశాన్ని ఘటనకు కొన్ని రోజుల ముందే చెప్పారు. కానీ, ప్రపంచమే పెద్దగా పట్టించుకోలేదు. ఇప్పుడు అది నిజమవడంతో షామన్ల ప్రిడిక్షన్‌పై పెద్ద చర్చ నడుస్తోంది. డిసెంబర్ 29వ తేదీన షామన్ల బృందం పెరూ రాజధాని లిమాలోని సముద్రం ఒడ్డున ఒక వార్షిక ధార్మిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారు రాబోయే సంవత్సరానికి సంబంధించి జోష్యం(ప్రిడిక్షన్) చెబుతారు. సాంప్రదాయ ఆండియన్ పోంచోలు, శిరస్త్రాణాలు ధరించి.. అంతర్జాతీయ సంబంధాల గమనం, కొనసాగుతున్న సంఘర్షణలు, ప్రపంచ దేశాల నాయకుల విధిని అంచనా వేస్తుంటారు. ఈ క్రమంలోనే.. వెనెజువెలా నాయకుడు మదురో భవిష్యత్‌ను కూడా షామన్లు చెప్పారు. మదురోను పదవి నుంచి తొలగిస్తారని.. ఆయనను తొలగించడంలో ట్రంప్ కీలక పాత్ర పోషిస్తారని పేర్కొన్నారు.'అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. మదురోను పదవి నుంచి తొలగిస్తాడని ముందే గ్రహించాము. ఆయనను వెళ్లిపోవాలని.. పదవీ విరమణ చేయాలని కోరాము. వచ్చే ఏడాది ఇది జరుగుతుందని ముందే ఊహించాము.' అని షామన్ అణా మారియా సిమియన్ తెలిపారు. అయితే, వారి అంచనా పాక్షికంగానే నిజమైంది. వాస్తవానికి వారు మదురో పతనాన్ని మాత్రమే ఊహించారట. ట్రంప్ ఆయన్ను పదవి నుంచి తొలగించినప్పటికీ.. మదురో వారికి చిక్కకుండా పారిపోతాడని భావించారట. కానీ, మదురోను యూఎస్ భద్రతా బలగాలు బందీగా తీసుకున్నాయి. 'నికోలస్ మదురో పతనాన్ని మేము చూస్తాము. వెనెజువెలా నుంచి ఆయన పారిపోతారు. అమెరికాకు పట్టుబడరు.' అని షామన్ జువాన్ డి డియోస్ గార్సియా డిసెంబర్ 29న ప్రకటించారు. కానీ.. మదురోను, ఆయన భార్యను యూఎస్ భద్రతా బలగాలు అదుపులోకి తీసుకున్నాయి. శనివారం నాడు వెనెజువెలా రాజధాని కారకాస్‌లోని సైనిక స్థావరంపై దాడి చేసిన అమెరికన్ భద్రతా బలగాలు.. అక్కడ ఉన్న మదురో ఆయన భార్య సిలియా ఎ÷–లోర్స్‌ని అదుపులోకి తీసుకున్నారు. ఈ దంపతులిద్దరిపై నార్కో టెర్రరిజం కుట్రలో పాల్గొన్నారనే అభియోగాలు మోపింది ట్రంప్ ప్రభుత్వం. అయితే, యూఎస్ చర్య యావత్ ప్రపంచాన్ని దిగ్భ్రం÷–రతికి గురి చేసింది. ఈ చర్యను పలు దేశాలు సమర్థిస్తుండగా.. మరికొన్ని దేశాలు తీవ్రంగా ఖండిస్తున్నాయి. సామ్రాజ్యవాద చర్యగా అభివర్ణిస్తున్నాయి. యూఎస్–వెనెజువెలా ఇష్యూనే కాదు.. ఉక్రెయిన్–రష్యా వార్ గురించి కూడా షామన్లు ప్రిడిక్షన్ చెప్పారు. ఉక్రెయిన్–రష్యా యుద్ధం కూడా ముగిసిపోతుందన్నారు. ఇరు దేశాలు శాంతి జెండాను ఎగురవేస్తాయని షామన్ గార్సియా చెప్పారు. షామన్లు ప్రిడిక్షన్ ప్రతి ఏటా డిసెంబర్ చివరిలో నిర్వహిస్తారు. షామన్లు చెప్పే వార్షిక ప్రిడిక్షన్స్‌లో కొన్ని నిజమవడం, మరికొన్ని కాకుండా ఉన్నాయి. వాస్తవానికి 2023లోనే ఉక్రెయిన్–రష్యా యుద్ధం ముగిసిపోతుందని షామన్లు అంచనా వేశారు. కానీ, అది జరగలేదు. మానహ హక్కుల ఉల్లంఘనకు జైలు శిక్షణ అనుభవించిన పెరివియన్ మాజీ అధ్యక్షుడు ఆల్బర్టో ఫుజిమోరి 12 నెలల్లోపు చనిపోతారని షామన్లు అంచనా వేశారు. వారి అంచనా నిజమైంది. ఫుజిమోరి సెప్టెంబర్ 2024లో 86 సంవత్సరాల వయసులో చనిపోయారు. ఇవేకాదు.. భూకంపాలు, వాతావరణ దృగ్విషయాలు వంటి ప్రకృతి వైపరీత్యాలను కూడా షామన్లు ఊహించి చెబుతుంటారు. మొత్తానికి వెనెజువెలా అధ్యక్షుడి విషయంలో వారు చెప్పింది నిజమవడంతో.. షామన్ల ప్రిడిక్షన్‌పై చర్చ మొదలైంది.

# మళ్లీ పెరిగిన బంగారం ధరలు

## వెండి కిలో మరో ఆరువేలు పెరుగుదల

**హైదరాబాద్, జనవరి 5 :** గత నాలుగు, ఐదు రోజులుగా కాస్త స్థిరంగా కొనసాగుతున్న బంగారం, వెండి ధరలు సోమవారం మళ్లీ దూకుడు పెంచాయి. ఒక్కసారిగా భారీ పెరుగుదల నమోదు చేశాయి. భౌగోళిక రాజకీయ అనిశ్చితుల నేపథ్యంలో పెట్టుబడిదారులు సురక్షిత ఆస్తుల వైపు మొగ్గు చూపుతుండడంతో బంగారం, వెండికి డిమాండ్ కొనసాగుతోంది. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి క్షీణిస్తుండడం కూడా బంగారం, వెండి ధరల పెరుగుదలకు కారణంగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం పదకొండు గంటల సమయంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర 1, 37, 400కి చేరింది. నిన్నటితో పోల్చుకుంటే 1,580 రూపాయలు పెరిగింది. ఇక, 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1, 25, 950కి చేరింది. నిన్నటితో పోల్చుకుంటే రూ. 1,450 పెరిగింది. ఇక, దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి రేటు రూ. 1, 37, 550కి చేరుకోగా, 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ ధర రూ. 1, 26, 100కి చేరుకుంది. మరోవైపు వెండి కూడా జోరు చూపిస్తోంది. గతం రోజుతో పోల్చుకుంటే కిలోకు ఏకంగా రూ.6 వేలు పెరిగింది. హైదరాబాద్‌లో ప్రస్తుతం కిలో వెండి ధర రూ. 2.65 లక్షలకు చేరుకుంది. దేశ రాజధాని ఢిల్లీలో కిలో వెండి ధర రూ. 2.47 లక్షలకు చేరింది. బంగారం, వెండిలో లాభాల స్వీకరణ జరిగి ధరలు తగ్గొచ్చు అనే అంచనాలు వినిపించిన నేపథ్యంలో ఇలా పెరగడం చాలా మంది నిపుణులకు షాకిస్తోంది.



## అంబేద్కర్ కాంస్య విగ్రహం ఏర్పాటుకి చర్యలు తీసుకోవాలి

### బిజెపి జిల్లా నాయకులు గుండా ఉపేందర్ రెడ్డి

**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** కూసుమంచి మండల కేంద్రంలో భారత రాజ్యాంగ నిర్మాత డా.బిఆర్ అంబేద్కర్ కాంస్య విగ్రహం ఏర్పాటుకి తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ బిజెపి జిల్లా నాయకులు,వార్డు సభ్యులు గుండా ఉపేందర్ రెడ్డి సోమవారం ప్రజావాణిలో జిల్లా అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస రెడ్డికి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్నటువంటి పాత విగ్రహం పోలీస్ స్టేషన్ పక్కన పునః ప్రతిష్టించడంతో సంరక్షణ లేక చుట్టూ పిచ్చి మొక్కలు ఏర్పడి,చెత్తా చెదారంతో నిండి దుర్గంధం వెదజల్లుతుంధని తెలిపారు.దీనికి తోడు ఇష్టారీతిన వాహనాలను అడ్డుగా పార్కింగ్ చేయడంతో అటువైపు వెళ్లే పరిస్థితి లేదని చెప్పారు. అంబేద్కర్ కు నివాళులు అర్పించేందుకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని వెల్లడించారు.తన సొంత నిధులతో ఏర్పాటు చేయనున్న అంబేద్కర్ కాంస్య విగ్రహానికి ప్రధాన కూడలిలో స్థలం కేటాయించాలని ఉపేందర్ రెడ్డి అదనపు కలెక్టర్‌కి విన్నవించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మంద చంద్రశేఖర్,టిడిపి నాయకులు అడపా శివ,దామళ్ల కోటి,తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఆర్ఆర్ ప్రగతి పాఠశాల విద్యార్థిని రాష్ట్రస్థాయికి ఎంపిక



**రామారెడ్డి, రాజముద్ర న్యూస్ :** కామారెడ్డి జిల్లా స్థాయిలో విశ్వం ఎడిటేచ్ వారు అబాకస్ ఉ వేదిక్ మాత్ గత నెల డిసెంబర్-21న నిర్వహించినటు వంటి డిస్ట్రిక్ లేవల్ కాంపిటేషన్ పోటీలో రామారెడ్డి మండల కేంద్రానికి చెందిన ఎస్ ఆర్ ఆర్ ప్రగతి పాఠశాల విద్యార్థిని కందుకూరి ప్రజ్ఞ శ్రీ (శ్రీనివాస్) జిల్లాస్థాయిలో మంచి గుర్తింపు పొంది రాష్ట్ర స్థాయిలో ఎంపిక కావడం జరిగింది.ఈ యొక్క ఎస్ఆర్ఆర్ పాఠశాలకు సంబంధించిన విద్యార్థులు రైసింగ్ స్టార్ అవార్డు కు ఎంపిక కావడం జరిగింది,.ఎం.బన్విత్,ఎల్. సృజన్ ,ఎం. రియాన్షిక, సర్టిఫైట్ పొందిన విద్యార్థులు ఎల్. మానస,ఎం. సాత్విక, ఎన్. సంయుక్త, బి.రిషి వర్న్ ,డి. లీనా, సిహెచ్. జస్మిత, ఇలాంటి విద్యార్థులు ఈ యొక్క పాఠశాల నుండి ఉన్నత విద్యా స్థాయిలో గుర్తింపు పొందడంపై గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఎస్ఆర్ఆర్ పాఠశాల యాజమాన్యం సంతోషం వ్యక్తం చేశారు.



## పిఆర్టియు 2026 క్యాలెండర్ ఆవిష్కరించిన ఎంఈఓ రాయల

**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలను మరింత పెంపొందించేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కూసుమంచి మండల విద్యాధికారి రాయల వీరస్వామి అన్నారు.పీఆర్టియు కూసుమంచి మండల శాఖ ఆధ్వర్యంలో నూతన సంవత్సర 2026 క్యాలెండర్ ను సోమవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఆయన ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో ఆదర్శవంతమైన విలువలు పెంపొందించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని తెలిపారు.అదే విధంగా ఎవ్రీ చైల్డ్ రీడ్, ఎఫ్ఎల్ఎస్, ఎఫ్ఎల్ఎన్ వంటి విద్యా కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేయాలని సూచించారు. పిఆర్టియు మండల అధ్యక్షులు శీలం ఆంజనేయులు మాట్లాడుతూ నూతన సంవత్సరంలో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పిఆర్టియు నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు.ఉపాధ్యాయుల ప్రధాన సమస్యలైన పిఆర్సీ,హెల్త్ కార్డులు,పెండింగ్ బిల్లులు తదితర సమస్యలు ఈ నూతన సంవత్సరంలో పరిష్కారం కావాలని ఆకాంక్షంచారు. ఈ సందర్భంగా మండలంలోని ఉపాధ్యాయులందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పిఆర్టియు మండల ప్రధాన కార్యదర్శి ఎం.సతీష్,రాష్ట్ర కార్యదర్శి జి.వి.రమణ, లక్ష్మనారాయణ, సోమయ్య,అనంత్,జిల్లా ఉపాధ్యక్షులు తాళ్లూరు చంద్రశేఖర్, పాపారావు, సర్వర్ మియా, ఉపేందర్, విజయ్ కుమార్, ముత్తయ్య, వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, అప్పయ్య, కృష్ణవేణి, శ్రుతి, కృష్ణ, చైతన్య, రవళి పాల్గొన్నారు.



## తెల్లాపూర్ బిఆర్ఎస్ నాయకుల డ్రామా రిలే నిరాహార దీక్షలు

### కాంగ్రెస్ నాయకుల విమర్శలు

**పఠాన్ చెరువు, రాజముద్ర న్యూస్:** జిహెచ్ఎంసిలో విలీనం కాకముందు గత మున్సిపాలిటీలో కలిసి ఉన్న విద్యుత్ నగర్ ఎంఐజి వెలిమెల గ్రామాలు, అటు ముత్తంగి డివిజన్ లో వెలిమెల గ్రామం ఇటు భారతి నగర్ డివిజన్ లో విద్యుత్ నగర్ ఎమ్ఐజి కలిసిపోయాయి. ఆ గ్రామము ఈ కాలనీ తెల్లాపూర్ కు అవినాభావ సంబంధంగా కలిసి ఉండేవి. ఇప్పుడు వేరు కావడంతో స్థానిక బిఆర్ఎస్ నాయకులు ఈ విషయంపై అధికారులను కలవడమో లేక ప్రజాప్రతినిధులను కలిసి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి ఈ గ్రామం, కాలనీ ని, 263 డివిజన్ తెల్లాపూర్ లో కలిపే ప్రయత్నం చేయాలి, కానీ స్థానిక బిఆర్ఎస్ నాయకులు మాత్రం కాంగ్రెస్ పార్టీపై ఇక్కడ స్థానిక నాయకుల పై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారు. హుటాహుటిన విద్యుత్ నగర్ కాలనీలో బిఆర్ఎస్ పార్టీ రిలే నిరాహార దీక్షల పేరుతో కాంగ్రెస్ నాయకులపై ఆరోపణలు చేసి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారు. ఈ విషయాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని 263 డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సిపి ప్రభాకర్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ లెలిజాల రవీందర్ లు విలేకరుల సమావేశంలో తెలిపారు. సమావేశంలో 263 డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులతోపాటు, సంగారెడ్డి జిల్లా డిసిసి ఉపాధ్యక్షులు అరుణ్ గౌడ్ డిసిసి ప్రధాన కార్యదర్శి ఉప్పరపల్లి సుధాకర్ రెడ్డి, మాధవరెడ్డి, తూర్పు శ్రీనివాస్, వాజీద్, ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

## జిల్లా పోలీస్ అధికారులతో సమీక్ష సమావేశం

### జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా



**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** వికారాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్‌హెచ్ఓలు ఇతర పోలీస్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాలో నమోదైన నేరాల పరిస్థితి, కేసుల నమోదు, దర్యాప్తు పురోగతి, పెండింగ్ కేసుల స్థితిగతులను ఎస్పీ సమగ్రంగా సమీక్షించారు. ముఖ్యంగా ఎక్కువకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులపై ప్రత్యేక దృష్టి సారించి వాటిని త్వరితగతిన పరిష్కరించేలా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. పెండింగ్ కేసుల విషయంలో ఎటువంటి నిర్లక్ష్యం చేయకుండా డీఎస్పీ ఇన్స్పెక్టర్ స్థాయి అధికారులు పర్యవేక్షణ చేస్తూ దర్యాప్తును వేగవంతం చేయాలని ఆదేశించారు. కోర్టుల్లో కేసుల ప్రాసిక్యూషన్ బలంగా ఉండేలా సాక్ష్యధారాల సేకరణలో లోపాలు ఉండకుండా చూడాలని, ఛార్జ్‌షీట్లను గడువులోగా దాఖలు చేయాలని సూచించారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాలకు దారితీసే బ్లాక్ స్పాట్లను గుర్తించి సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుంటూ తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ట్రాఫిక్ నియమాల అమలులో ఎలాంటి రాజీ లేకుండా నిరంతర వాహన తనిఖీలు, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టాలని స్పష్టం చేశారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో సీసీటీవీ మెరాల ఏర్పాటు నిర్వహణ పకడ్బందీగా ఉండేలా చూడాలని, మట్కా, జూదం, గంజాయి ఇతర అక్రమ కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతూ ఎన్ఫోర్స్‌మెంట్ చర్యలను మరింత పెంచాలని, అలాంటి కార్యకలాపాల్లో పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలీస్ స్టేషన్లలో 5 ఎస్ విధానాన్ని తప్పనిసరిగా అమలు చేయాలని, రికార్డుల నిర్వహణ పారదర్శకంగా ఉండాలని ప్రతి కేసు వివరాలను సకాలంలో ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అధికారులకు సూచించారు. ప్రజలకు పోలీస్ స్టేషన్‌కు వచ్చినప్పుడు మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, నాన్-బైలబుల్ వారెంట్లు (ఎన్‌బిడబ్ల్యూలు) పెండింగ్ లేకుండా అమలు చేయాలని, కోర్టులతో సమన్వయం పెంచుకోవాలని సూచించారు. ఫిర్యాదుదారులకు తక్షణ స్పందన అందించి నమ్మకం పెంపొందించాలని పేర్కొన్నారు. మహిళల భద్రత, పిల్లల రక్షణ, ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ కేసుల విషయంలో అత్యంత సున్నితంగా కఠినంగా వ్యవహరించాలని ఎస్పీ ఆదేశించారు. పాత నేరస్థులు, రౌడీ షీటర్లు, అనుమానాస్పద వ్యక్తులపై నిరంతర నిఘా కొనసాగించాలని, గ్రేవ్ కేసులలో పక్కా ఆధారాలతో దర్యాప్తు పూర్తి చేసి నిందితులకు శిక్ష పడేలా చూడాలని స్పష్టం చేశారు.

**గుడ్ వర్క్ చేసిన అధికారులకు క్యాష్ రివార్డ్స్ :**

గత నెలలో జిల్లాలో గుడ్ వర్క్ చేసిన పోలీస్ అధికారులు ధరూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రఘురాములు,పరిగి సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది నరేష్, రామకృష్ణ, పాండురంగం, మున్నయ్య, దస్తప్ప, ప్రతాప్ సింగ్, జమీల్, అనిల్ కుమార్ లను ఎస్పీ క్యాస్ రివార్డ్స్ లు ఇవ్వడం జరిగింది. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ బి. రాములు నాయక్, డి సి ఆర్ బి డీఎస్పీ జానయ్య, వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, తాండూర్ డీఎస్పీ ఎన్. యాదయ్య, పరిగి డీఎస్పీ శ్రీనివాస్, ఏ ఆర్ డీఎస్పీ వీరేష్, ఎ ఓ ఖాజామోహినొద్దీన్, సీఐ లు, ఆర్ ఐ లు, ఎస్.ఐ లు, ఆర్.ఎస్.ఐ లు, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఫలించిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కృషి

- **మరికొద్ది రోజుల్లో పటాన్ చెరువు కేంద్రంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సేవలు**
- **కార్యాలయం ఏర్పాటుకు హైకోర్టులో లైన్ క్లియర్.. ప్రభుత్వానికి ఆదేశాలు జారీ.**
- **ఉమ్మడి జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం సంగారెడ్డి లోనే..**



**పఠాన్ చెరువు, రాజముద్ర న్యూస్:** రియల్ ఎస్టేట్ రంగంలో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న పటాన్ చెరువు నియోజకవర్గ పరిధిలో ప్రజలకు అందుబాటులో రిజిస్ట్రేషన్ కార్యాలయం ఏర్పాటు చేయాలన్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ప్రయత్నాలు ఫలించాయి. పటాన్చెరు పట్టణ కేంద్రంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటుకు హైకోర్టులో న్యాయపరమైన చిక్కులు తొలగిపోయాయని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు కార్యాలయం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి రాజీవ్ గాంధీ హనుమంతు రిజిస్ట్రేషన్ మరియు స్టాంప్స్ ఇన్స్పెక్టర్ జనరల్‌కు ఆదేశాలు జారీ చేశారని ఆయన తెలిపారు. ఇదిలా ఉండగా 2018 అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ పటాన్చెరులో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటు చేస్తామని ప్రకటించగా.. 2023లో ఇందుకు సంబంధించి జీవో నెంబర్ 30 జారీ చేశారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం తో పాటు ఉమ్మడి మెదక్ జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం సైతం పటాన్చెరులో ఏర్పాటు చేయాలని జీవోలో పేర్కొన్నారు. ఈ అంశంపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ పలువురు వ్యక్తులు హైకోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు జీవో నెంబర్ 30 అమలు పైన హైకోర్టు స్టే విధించింది. దీంతో పటాన్చెరులో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటుకు బ్రేక్ పడింది. స్టే ఎత్తివేయాలని కోరుతూ పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి నేతృతంలో గత రెండు సంవత్సరాలుగా కొనసాగిన ప్రయత్నా లకు ఎట్టకేలకు ఫలితం లభించింది. జిల్లా కేంద్రమైన సం గారెడ్డి లోనే డిఆర్ఓ కార్యా లయం కొనసాగించ డంతో పాటు.. పటాన్చెరు కేంద్రంగా పటాన్చెరు రిజిస్ట్రార్ సబ్ కార్యాలయం సేవలు ప్రారంభించేందుకు తమకు ఎటువంటి అభ్యంతరాలు లేవని హైకోర్టుకు తెలిపారు. దీంతో పటాన్చెరు కేంద్రంగా సబ్ రిజిస్టార్ కార్యాలయం సేవల ప్రారంభానికి అడ్డంకులు తొలగిపోయాయి.

**అతి త్వరలో కార్యాలయం ప్రారంభం..**

న్యాయపరమైన చిక్కులు తొలగిపోవడంతో అతి త్వరలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ప్రారంభించబోతున్నట్లు ఎమ్మెల్యే జిఎంఆర్ తెలిపారు. తాత్కాలికంగా పటాన్చెరు డివిజన్ పరిధిలోని పాత ఎమ్మార్వో కార్యాలయం కేంద్రంగా కార్యకలాపాలు ప్రారంభమవుతాయని తెలిపారు. శాశ్వత భవన నిర్మాణం కోసం ఐదు ఎకరాలు కేటాయించాలని గతంలోనే ప్రభుత్వానికి విన్నవించడం జరిగిందని తెలిపారు.

## అంగన్వాడీ ఉద్యోగం చేస్తూనే డిఐసిలో సబ్సిడీ రుణాలు పొందిన వైనం

### సూపర్వైజర్ ను అడగగా పొంతన లేని సమాధానం



**కామారెడ్డి, రాజముద్ర న్యూస్:** జిల్లాలోని రామారెడ్డి మండలంలోని ఓ గ్రామానికి చెందిన మహిళ అంగన్వాడి విధులు నిర్వహిస్తూ జిల్లా పరిశ్రమల కేంద్రం నుంచి సబ్సిడీపై వచ్చే ట్రాక్టరు ఇతర యంత్రాల కు సంబంధించిన రుణాలు తీసుకున్న విషయం వెలుగులోకి వచ్చింది. ఒకవైపు నిరుద్యోగులు పి ఎం ఈ జిపి రుణాల కోసం జిల్లాలో బతుకు తెరువు కోసం అప్లికేషన్లు పెట్టుకోగా బ్యాంకులవారు రకరకాల కొర్రీలు పెడుతూ ఆపిన ఆపుతున్నటువంటి వైనం గతం నుండి చూస్తున్నాం. మరి ఓవైపు ఉపాధి అంగన్వాడి ఉపాధి ఉండగానే మరోవైపు ఈ సబ్సిడీపై వచ్చే రుణాలు ఏ విధంగా ఇచ్చారో డిఐసి అధికారులకు బ్యాంకు అధికారులకు తెలియకుండానే జరిగిందా అని ఆ గ్రామంలో జనాలు నిరుద్యోగులు చర్చించుకోవడం ఆలోచించదగ్గ విషయం. మరి సంబంధిత డిపార్ట్మెంట్ అధికారులు ఏం చర్యలు తీసుకుంటారో నని ఆ గ్రామంలోని ప్రజలు చర్చించుకోవడం చర్చకు దారి తీసింది.

## పేరూరు ఎస్సైకి సన్మానం



**వాజేడు, రాజముద్ర న్యూస్:** మండల కేంద్రం పేరూరు గ్రామపంచాయతీ నూతన సర్పంచ్ గొడ్డే సరోజినీ దేవి,ఉపసర్పంచ్ తాడూరి సంపత్ వార్డు సభ్యులు,కూటమి నాయకులు, కార్యకర్తలు కలిసి సోమవారం ఎస్సై గుర్రం కృష్ణ ప్రసాద్ కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి సాలువతో సన్మానించారు. ప్రభుత్వ వైద్యశాల తనిఖీ : పేరూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సర్పంచ్, ఉప సర్పంచ్ వార్డు సభ్యులు, గ్రామ నాయకులు తనిఖీ చేశారు.సర్పంచ్ మాట్లాడుతూ.. పేరూరు పంచాయతీ పరిధి చుట్టుపక్కల గ్రామాలు ఏజెన్సీ ప్రాంతం కావడంతో ప్రజలకు ఇబ్బంది కలగకుండా అన్ని మందులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని,ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి, వైద్య సిబ్బంది ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని, పేరూరు పరిధిలో ఉన్న గ్రామ ప్రజలకు 24 గంటలు అత్యవసర వైద్య సేవలు అందించాలని అన్నారు.పేరూరు బాలుర గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల సర్పంచ్, ఉప సర్పంచ్,గ్రామ వార్డు సభ్యులు, నాయకులు తనిఖీ చేసి విద్యార్థులకు సరైన భోజనం అందించాలని,వంద శాతం విద్యార్థులు హాజరయ్యేలా చూడాలని, ప్రధానోపాధ్యాయులు అందుబాటులో ఉండి విద్యార్థులకు మంచి విద్య అందించాలని తెలియజేశారు.ఆశ్రమ ఉన్నత పాఠశాలను స్పోర్ట్స్ పాఠశాలగా తీర్చిదిద్దేల కృషి చేస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





## ఏపీ కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్‌కి ఘన సన్మానం

**శేరిలింగంపల్లి, రాజముద్ర న్యూస్:** ఆంధ్రప్రదేశ్ కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ప్రమాణ స్వీకారం చేసిన అడుసుమిల్లి శ్రీనివాస రావు ని కాంగ్రెస్ సీనియర్ నాయకులు ప్రసాద్స్ ఫౌండేషన్ చైర్మన్ డిఎస్ఆర్ ప్రసాద్, లీల ప్రసాద్ లు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సత్కరించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్స్ ఫౌండేషన్ చైర్మన్ డి ఎస్ ఆర్ ప్రసాద్ మియాపూర్ డివిజన్ డి ఎస్ ఆర్ ప్రసాద్ టీమ్ సభ్యులు భాష, రవి, సురేందర్, రాంబాబు, మూర్తి, శేఖర్ నాయుడు, వెంకట్రావు, ఎంఆర్ చౌదరి, దొప్పలపూడి వినోద్ చౌదరి, శ్రీను, శ్రీకాంత్, పెద్ద బాబు, సుదులగుంట్ల ప్రసాద్, రాజేష్, తులసి, పవన్, బాలు, చిన్న, బొజ్జ రవికుమార్, సతీష్, సింహాచలం, కమలాకర్ రెడ్డి, పవన్ రెడ్డి, నరేష్ (నాని), పవన్, అభిజిత్, రాము తదితరులు పాల్గొన్నారు.



## బ్రిలియంట్ స్కూల్‌లో విద్యార్థులకు టూత్ బ్రష్ పేస్ట్ టంగ్ క్లీనర్ కిట్లు అందజేత

**ఆత్మకూర్( ఎం) రాజముద్ర న్యూస్ :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు( ఎం) మండల కేంద్రంలో బ్రిలియంట్ స్కూల్లో గ్రామ సర్పంచ్ బిసు ధనలక్ష్మ చందర్ గౌడ్ చేతుల మీదుగా టూత్ పేస్ట్ టంగ్ క్లీనర్ కిట్లు పంపిణి చేసారు విద్యార్థులకు నేతాజీకి యువజన మండలి సభ్యులకు క్రికెట్ కిట్లు పంపిణి చేసారు విద్యార్థులకు దంత సంరక్షణ పై అవగాహన కల్పించారు ఈ కార్యక్రమానికి పాఠశాల చైర్మన్ ప్రతికంఠం పూర్ణచంద్రరాజు అధ్యక్షత వహించారు పాఠశాల ప్రిన్సిపల్ పావని కోటేశ్వరి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎన్నారై ఏనుగు వెంకటరామిరెడ్డి గ్రామ ఉప సర్పంచ్ వార్డు సభ్యులు పాఠశాల ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు యువజన మండలి అధ్యక్షులు మురళీకృష్ణ శంతన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## చైనా మాంజా రవాణా, నిలువ చేసిన, అమ్మిన కఠిన చర్యలు

### :ఎస్సై కూచిపూడి జగదీష్



**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** చైనా మాంజా రవాణా చేసిన,అమ్మిన, నిలువ చేసిన చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తిరుమలాయపాలెం ఎస్సై కూచిపూడి జగదీష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సందర్భంగా గాలిపటాలు ఎగరేసే సమయంలో తలెత్తే ప్రమాదాలపై ప్రజలందరూ అవగాహన కలిగి ఉండాలన్నారు.చైనా మాంజా వినియోగం వల్ల పక్షులు గాయపడటం,మనుషులు ప్రాణాలు కోల్పోవడం వంటి సంఘటనలు చోటు చేసుకున్నాయని గుర్తు చేశారు.గాలి పటాలు ఎగరడానికి ఉపయోగించే నైలాన్, సింథటిక్ దారాలకు పూత పూసిన చైనా మాంజా అత్యంత ప్రమాదకరమని తెలిపారు.ఈ నేపథ్యంలో జాతీయ హరిత ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు రాష్ట్రంలో చైనా మాంజా వినియోగాన్ని పూర్తిగా నిషేధించినట్లు వెల్లడించారు.ఈ కేసుల్లో బీఎన్ఎస్ సెక్షన్ 223, 125తో పాటు పర్యావరణ పరిరక్షణ చట్టం సెక్షన్ 5,15 కింద కేసులు నమోదు చేయనున్నట్లు తెలిపారు.చైనా మాంజా తయారీ,అమ్మకం లేదా రవాణా చేస్తున్నట్లు సమాచారం ఉంటే సంబంధిత పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్ 100 కు సమాచారం ఇవ్వాలని ఎస్సై జగదీష్ మండల ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



## రజక సంఘం ఆధ్వర్యంలో పైళ్ళ ప్రసన్న ప్రశాంతుకు శాలువతో సన్మానం

**ఆత్మకూర్(ఎం) రాజముద్ర న్యూస్:** ఆత్మకూర్( ఎం) గ్రామపంచాయతీ ఎన్నికలలో, మూడవ వార్డు సభ్యురాలుగా గెలుపొందిన రజక ఆడబిడ్డ పైళ్ళ ప్రసన్న ప్రశాంతు కు రజక సహకార సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం అధ్యక్షులు ఎలిమినేటి మురళి, ఉపాధ్యక్షులు ఎలిమినేటి నరేష్, ప్రధాన కార్యదర్శి పైళ్ళ ప్రశాంత్, మాజీ అధ్యక్షులు ఎలిమినేటి నరసింహ, ఐలమ్మ విగ్రహ కమిటీ అధ్యక్షులు ఎలిమినేటి నాగేష్, మరియు సభ్యులు ఎలిమినేటి ఎలేందర్,పోతుగంటి ఉప్పలయ్య, వేలుమ కన్నె స్వామి, ప్రశాంత్, ఎలిమినేటి యాదయ్య, నరసయ్య ,సత్తయ్య ,పుల్లయ్య, చంద్రయ్య ,యాదయ్య, రవి,అభి , రాజు,మహేష్ తదితరులు పాల్గొన్నారు.



## ఆత్మీయ విందులో పాల్గొన్న నాయకులు

**బీర్కూర్, రాజముద్ర, న్యూస్ :** బీర్కూర్ మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ నాయకులు మియాపురం శశికాంత్ తన స్వగృహంలో ఆత్మీయ విందు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఆత్మీయ విందుకు విచ్చేసిన నాయకులకు మియాపురం శశికాంత్ పుష్పగుచ్ఛం ఇచ్చి విందుకు ఆహ్వానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉమ్మడి నిజామాబాద్ డిసిసిబి మాజీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి, ఆగ్రో చైర్మన్ కాసుల బాలరాజ్, బాన్సువాడ నియోజకవర్గం మాజీ ఇంచార్జ్ పోచారం సురేందర్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీర్కూర్ మండల కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



## అలరించిన సంగీత విభావరి

**కూకట్‌పల్లి, రాజముద్ర న్యూస్ :** కూకట్పల్లిలోని శ్రీ సీతా రామచంద్ర స్వామి ఆలయంలో మణి సుధా మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం నాడు శ్రీ రామదాసు, శ్రీ అన్నమయ్య సమాకీర్తనర్చాన్ పేరుతో సంగీత విభావరి కార్యక్రమం నిర్వహించారు. అకాడమీ నిర్వాహకులు మణి సుధాకర్ పర్యవేక్షణ లో జరిగిన ఈ కార్యక్రమం లో భాగంగా చిన్నారులు ఆలపించిన ఆధ్యాత్మిక పాటలు, రామదాసు, అన్నమాచార్య కీర్తనలు ఆకట్టుకున్నాయి. అనంతరం చిన్నారులకు బహుమతులు అందజేశారు.



### ప్రస్తుత తరం జర్నలిస్ట్‌ల కోసం ఓ కొత్త మార్గదర్శకం

## జర్నలిజం నైతికత

- పులి అమృత్ రచించిన ඃజర్నలిజం నైతికతః పుస్తకాన్ని జర్నలిస్ట్ పరమేష్ సాగర్, మల్లేష్ కి బహుమతిగా అందజేశారు
- పులి అమృత్ రచించిన 'జర్నలిజం నైతికత' పుస్తకం

**శేరిలింగంపల్లి, రాజముద్ర న్యూస్:** ప్రస్తుత పోటీతో నిండిన మీడియా యుగంలో జర్నలిజంలోకి అడుగుపెడుతున్న ప్రస్తుత తరం జర్నలిస్టులకు నైతిక విలువలపై స్పష్టమైన అవగాహన ఎంతో అవసరం. ఈ నేపథ్యంలో సీనియర్ జర్నలిస్టు, రచయిత పులి అమృత్ రచించిన 'జర్నలిజం నైతికత' అనే పుస్తకం యువ జర్నలిస్టులకు ఒక దిశానిర్దేశక గ్రంథంగా నిలుస్తోంది. వార్తా సేకరణ నుంచి ప్రసారం వరకు జర్నలిస్టు పాటించాల్సిన నైతిక ప్రమాణాలు, వృత్తి బాధ్యతలు, నిజాయితీ, సమతుల్యత, పక్షపాత రహితత వంటి కీలక అంశాలను ఈ పుస్తకం సరళమైన భాషలో వివరించింది. ఫేక్ న్యూస్, రాజకీయ ఒత్తిళ్లు, కార్పొరేట్ ప్రభావాలు వంటి నేటి మీడియా సవాళ్లను ఎలా ఎదుర్కోవాలనే అంశాలపై రచయి-ంత స్పష్టమైన విశ్లేషణను అందించారు. ముఖ్యంగా జర్నలిజం విద్యార్థులు, కొత్తగా రంగ ప్రవేశం చేస్తున్న రిపోర్టర్లు, డిజిటల్ మీడియా కార్యకర్తలకు ఈ పుస్తకం ప్రాయోగిక మార్గదర్శకంగా ఉపయోగపడుతుంది. జర్నలిజం వృత్తిని కేవలం ఉపాధిగా కాకుండా సామాజిక బాధ్యతగా చూడాలనే సందేశాన్ని ఈ గ్రంథం బలంగా ప్రతిపాదిస్తోంది. నైతిక విలువలతో కూడిన జర్నలిజాన్ని పెంపొందించాలనే లక్ష్యంతో రూపొందిన 'జర్నలిజం నైతికత' పుస్తకం ప్రస్తుత తరం జర్నలిస్టుల గ్రంథలయంలో తప్పనిసరిగా ఉండాల్సిన ఒక ముఖ్యమైన రచనగా భావించవచ్చు, జర్నలిజం వృత్తిలో ఉన్న వారందరూ మన వృత్తి నియమాలని పాటించాలని, ప్రస్తుతం మార్కెట్లో జర్నలిస్టులను చిన్న చూపు చూస్తున్నారని ఆవేదన, మన జర్నలిజం నైతిక విలువలను కాపాడుకునేందుకు మన అందరి బాధ్యత అని తెలిపారు.

## ఏ దేశమూ ప్రపంచ పోలీస్ కాదు

### మదురో నిర్బంధంపై చైనా ఆగ్రహం



**చైనా :** వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురో, ఆయన భార్య ను అమెరికా నిర్బంధించడంపై చైనా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిం ది. ఇలాంటి ఏకపక్ష వేధింపులు ఈ మధ్యకాలంలో ఎక్కువయ్యా యని అగ్రరాజ్యంపై మండిపడిం ది. ప్రపంచ పోలీస్ లేదా అంత ర్జాతీయ న్యాయమూర్తిగా వ్యవహరించేందుకు ఏ దేశానికీ అధికా రం లేదని పేర్కొంది. "ప్రస్తుతం అంత ర్జాతీయంగా పరిస్థితులు అస్థిరంగా ఉన్నాయి. వెనెజువెలా పరిణామాలపై అంతర్జాతీయ సమాజం దృష్టిసారించింది. బలప్రయోగాన్ని చైనా ఎప్పుడూ వ్యతిరేకిస్తుంది. ఓ దేశం తమ ఇష్టాలను ఇంకో దేశంపై బలవంతంగా రుద్దకూడదు. ఏ దేశ మైనా ప్రపంచ పోలీసు పాత్రను పోషించలేదు. అంతర్జాతీయ న్యాయ మూర్తినంటూ తమను తాము సమర్థించుకోడం సరికాదు. అంతర్జాతీయ చట్టాలు దేశాల సార్వభౌమత్వాన్ని రక్షంచాలి. అన్నిదేశాల సార్వభౌమత్వాన్ని గౌరవించినప్పుడే ప్రపంచ శాంతి సాధ్యమవుతుంది" అని చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ వెల్లడించారు. గత రెండు దశాబ్దాలుగా వెనెజువెలాకు అతి పెద్ద చమురు కొనుగోలుదారుగా చైనా ఉంది.



## కాలుష్యంపై పోరుకు 'సముద్ర ప్రతాప్'


### ప్రారంభించిన రాజ్‌నాథ్‌సింగ్

**న్యూఢిల్లీ :** 'సముద్ర ప్రతాప్' నౌకను సోమవారం రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ జలప్రవేశం చేయించారు. గోవా షిప్‌యార్డ్‌లో ఈ కార్యక్రమం జరిగింది. దీనిని ఇప్పటికే భారత తీరగస్తీ దళానికి (ఇండియన్ కోస్ట్‌గార్డ్) అప్పగించిన సంగతి తెలిసిందే. కాలుష్య నియంత్రణకు ఉపయోగపడేలా గోవా షిప్‌యార్డ్ లిమిటెడ్ ఈ నౌకను నిర్మించింది. సముద్ర జలాల్లో కాలుష్యాన్ని.. ముఖ్యంగా చమురు వ్యర్థాలను నిర్మూలించి జలచరాలను కాపాడేందుకు దోహదపడే అధునాతన సాంకేతికత ఇందులో ఉంది. "ఈ నౌక మన సంకల్పానికి నిదర్శనం. సాగరాల్లో కాలుష్య నియంత్రణపై దృష్టి సారించి దీనిని తీర్చిదిద్దారు. దీంతోపాటు తీర గస్తీ, సముద్ర భద్రతను బలోపేతం చేయడంలో ఇది కీలకంగా వ్యవహరిస్తుందని భావిస్తున్నాను. ఇందులో 60 శాతానికిపైగా స్వదేశీ పరికరాలను వినియోగించాం. దేశ స్వావలంబన దిశగా ఇదొక కీలక ముందడుగు" అని రాజ్‌నాథ్ సింగ్ అభివర్ణించారు.

### టారిఫ్‌లు తగ్గించాలని ట్రంప్‌నకు

## చెప్పాలని భారత్ కోరింది

### అమెరికా సెనెటర్ వివాదాస్పద వ్యాఖ్యలు



**యూఎస్ :** టారిఫ్‌లు తగ్గించాలని భారత్ తమను కోరిందంటూ అమెరికా సెనెటర్ లిండ్సీ గ్రాహమ్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఈ మేరకు దాదాపు నెల క్రితం భారత రాయబారి వినయ్‌మోహన్ క్వాత్రాతో జరిగిన సంభాషణ గురించి వెల్లడించారు. రష్యా చమురు దిగుమతులను భారత్ తగ్గించుకుందని క్వాత్రా చెప్పినట్లు పేర్కొన్నారు. ఈ విషయాన్ని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు చెప్పి, 25 శాతం సుంకం తగ్గించేలా చూడాలని భారత రాయబారి కోరారంటూ అనుచితంగా మాట్లాడారు. గత నెల భారత రాయబారి క్వాత్రా నివాసానికి గ్రాహమ్ వెళ్లారు. ఆ సమయంలోనే తమ మధ్య టారిఫ్ అంశం చర్చకు వచ్చినట్లు సెనెటర్ తెలిపారు. లిండ్సీ గ్రాహమ్ మీడియాతో ఈ విషయం చెప్తున్నప్పుడు ఆయన వెంట ట్రంప్ కూడా ఉన్నారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేసే దేశాల నుంచి అగ్రరాజ్యం చేసుకొనే దిగుమతులపై 500 శాతం పన్నుతో 'ఆర్థిక బంకర్ బస్టర్' జారవిడుస్తామంటూ గ్రాహమ్ గతంలో హెచ్చరికలు చేసిన సంగతి తెలిసిందే. కాగా.. సుంకాలు పెంచుతానని ట్రంప్ హెచ్చరించిన నేపథ్యంలోనే గ్రాహమ్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. "ప్రధాని మోదీ మంచి వ్యక్తి. నేను సంతోషంగా లేనన్న విషయం ఆయనకు తెలుసు. నన్ను సంతోషపెట్టడం చాలా ముఖ్యం. వారు (రష్యాతో) వ్యాపారం కొనసాగిస్తే.. మనం సుంకాలను చాలా వేగంగా పెంచుతాము" అని ఆయన హెచ్చరికల ఆడియో క్లిప్‌ను శ్వేతసౌధం ఎక్స్ ఖాతాలో షేర్ చేసింది.

### మాట వినకుంటే

## మదురో కంటే ఘోరమైన గతి

### వెనెజువెలా తాత్కాలిక అధ్యక్షురాలికి ట్రంప్ వార్నింగ్



**వాషింగ్టన్:** వెనెజువెలా తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గట్టి హెచ్చరికలు చేశారు. అగ్రరాజ్యం మాట వినకుంటే ఆమె భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని వార్నింగ్ ఇచ్చారు. ఓ మీడియా పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. నికోలస్ మదురోను అమెరికా నిర్బంధించడంతో ఉపాధ్యక్షురాలిగా ఉన్న డెల్సీ రోడ్రిగ్జ్ తాత్కాలిక అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టిన సంగతి తెలిసిందే. ఆమె నియామకంపై శనివారం ట్రంప్ స్పందిస్తూ.. వెనెజువెలాలో ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపర్చేందుకు అమెరికా చేయాలనుకుంటున్న పనులను చేసేందుకు డెల్సీ సుముఖంగా ఉందన్నారు. అయితే, తాత్కాలి క అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆమె అమె రికా చర్యలను విమర్శించారు. మదురోను నిర్బంధించడం సరికాదని, ఆయనను వెంటనే వదిలేయాలని డిమాండ్ చేశా రు. డెల్సీ స్పందనపై ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. "దీన్ని మేం సహించబోం. ఆమె సరైన నిర్ణయాలు తీసుకోకపోతే మదురో కంటే ఘోరమైన గతి పడుతుంది. వెనెజువెలాపై మా నియంత్రణకు ఆమె అంగీకరించాల్సిందే. అప్పుడే ఆ దేశాన్ని మేం పునర్ నిర్మించగలం. మేం కోరుకున్నది ఆమె చేస్తే.. వెనెజువెలాలో మా బలగాలను మోహరించబోం" అని ట్రంప్ హెచ్చరించారు.

#### మాతో కలిసి పనిచేయండి: డెల్సీ

మరోవైపు వెనెజువెలాతో కలిసి పని చేసేందుకు అమెరికా ప్రభుత్వానికి డెల్సీ ఆహ్వానం పంపించారు. "శాంతిస్థాపనకు మేం కట్టుబడి ఉన్నాం. వెలుపలి నుంచి ఎలాంటి ముప్పు లేకుండా అంతర్జాతీయ సహకారంతో గౌరవప్రదంగా జీవించాలని మా దేశం కోరుకుంటోంది. ప్రతి దేశంలో శాంతియుత పరిస్థితులు ఉన్నప్పుడే ప్రపంచశాంతి నెలకొంటుందని మేం విశ్వసిస్తున్నాం. అమెరికాతో పాటు అన్ని దేశాలతో మర్యాద పూర్వక, సమతుల్య సంబంధాలు నెలకొల్పడానికి మేం ప్రాధాన్యమిస్తాం. మా దేశ పురోగతి కోసం మాతో కలిసి పని చేసేందుకు అమెరికాను ఆహ్వానిస్తున్నాం" అని ఆమె తన సోషల్ మీడియాలో సుదీర్ఘ పోస్ట్ చేశారు.

### ఢిల్లీ అల్లర్ల కేసు.. ఉమర్ ఖాలిద్,


## ఇమామ్‌కు బెయిల్ నిరాకరణ



**న్యూఢిల్లీ :** దేశ రాజధానిలో 2020లో చోటుచేసుకున్న అల్లర్ల కేసులో సుప్రీంకోర్టు సోమవారం కీలక తీర్పు వెలువరించింది. ఈ కేసులో అరెస్టయిన ఉమర్ ఖాలిద్, శర్జీల్ ఇమామ్‌కు బెయిల్ ఇచ్చేందుకు అత్యున్నత న్యాయస్థానం నిరాకరించింది. అయితే, ఇదే కేసులో నిందితులైన మరో ఐదుగురికి మాత్రం సుప్రీం ధర్మాసనం బెయిల్ మంజూరు చేసింది. "ఈ కుట్ర కేసులో ఉమర్ ఖాలిద్, శర్జీల్ ఇమామ్ నేరానికి పాల్పడినట్లు బలమైన ఆధారాలున్నాయి. ఈ కేసులో మిగతా నిందితులతో పోలిస్తే వీరిద్దరిపై అభియోగాలు భిన్నమైనవి. ఇలాంటి దశలో వారికి బెయిల్ ఇవ్వడం సరైన నిర్ణయం కాదు" అని సుప్రీంకోర్టు వెల్లడించింది. పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా 2020 ఫిబ్రవరిలో దిల్లీలో జరిగిన హింసాత్మక నిరసనలు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. ఆ అల్లర్లలో 53 మంది దుర్మరణం చెందగా.. 700 మందికి పైగా గాయపడ్డారు. ఇంటెలిజెన్స్ బ్యూరో అధికారి అంకిత్ శర్మ కూడా హత్యకు గురయ్యారు. ఈ అల్లర్లకు సంబంధించి 15 మందిని నిందితులుగా పేర్కొంటూ చట్ట వ్యతిరేక కార్యకలాపాల చట్టం (ఉపా) కింద ఛార్జిషీటు నమోదు చేశారు. వీరిలో కొందరికి గతంలో బెయిల్ లభించింది. ఉమర్ ఖాలిద్, శర్జీల్ ఇమామ్ సహా ఏడుగురి నిందితుల బెయి-ల్‌ను గతేడాది సెప్టెంబరులో దిల్లీ హైకోర్టు నిరాకరించింది. ఆ తీర్పును సవాల్ చేస్తూ వీరు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీనిపై ఇటీవల విచారణ జరిపిన సర్వోన్నత న్యాయస్థానం డిసెంబరు 10న తీర్పును రిజర్వ్ చేసింది. తాజాగా ఖాలిద్, ఇమామ్‌కు బెయిల్ నిరాకరిస్తూ తీర్పు వెలువరించింది. మరో ఐదుగురు నిందితులు గుల్ఫిషా ఫాతిమా, మీరాన్ హైదర్, షిఫా ఉర్ రహమాన్, మహ్మద్ సలీమ్ ఖాన్, షాదాబ్ అహ్మద్‌కు కోర్టు ఊరట కల్పించింది.

## టీవీకే నేతతో వివాదం వేళ..

### 'లేడీ సింగం'పై బదిలీ వేటు



**న్యూఢిల్లీ :** లేడీ సింగంగా సోషల్ మీడియాలో వైరలైన తమిళనాడులోని ఐపీఎస్ అధికారిణి ఇషా సింగ్‌పై బదిలీ వేటు పడింది. ఇషా సింగ్‌ను పుదుచ్చేరి నుంచి దిల్లీకి బదిలీ చేస్తూ.. అక్కడి ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. టీవీకే ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్‌తో వివాదం వేళ.. ఆమెపై ఈ చర్యలు తీసుకోవడం గమనార్హం. అసలేమయ్యిందంటే? గతేడాది సెప్టెంబర్‌లో టీవీకే చీఫ్ విజయ్ ప్రచార ర్యాలీలో తొక్కిసలాట జరిగిన సంగతి తెలిసిందే. అనంతరం పుదుచ్చేరిలో నిర్వహించిన మరో బహిరంగ కార్యక్రమంలో పోలీసులు ప్రజల హాజరుపై కఠిన ఆంక్షలు విధించారు. కాగా వేదిక వద్దకు విజయ్ చేరుకున్న అనంతరం టీవీకే ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్ వేదిక వద్ద స్థలం ఉందని.. లోపలికి రావాలని మైకులో ప్రజలకు సూచించారు. దీంతో అక్కడే ఉన్న ఐపీఎస్ అధికారిణి ఇషా సింగ్ ఆయన నుంచి మైకు లాక్కొన్నారు. "కరూర్ తొక్కిసలాటలో 41 మంది ప్రజలు ప్రాణాలు కోల్పోయిన విషయాన్ని అప్పుడే మరిచిపోయారా? ఎందుకు ఎక్కువమంది ప్రజలను వేదిక వద్దకు రమ్మని పిలుస్తున్నారు" అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. దీంతో టీవీకే నేత తీరుపై నెటిజన్లు విమర్శలు వ్యక్తంచేశారు. జన సమీకరణ విషయంలో రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా ఐపీఎస్ అధికారిణి చూపిన ధైర్యాన్ని కొనియాడుతూ.. ఆమెను లేడీ సింగంగా అభివర్ణించారు. ఈ ఘటన నేపథ్యంలో ఆమెపై బదిలీ వేటు పడటం ప్రాధాన్యం సంతరించుకుంది.

## పీవోకేను భారత్‌లో విలీనం చేయాలి : బ్రిటన్ ఎంపీ



**న్యూఢిల్లీ :** జమ్మూ కశ్మీర్‌పై బ్రిటన్ ఎంపీ బాబ్ బ్లాక్‌మన్ కీలక వ్యాఖ్యలు చేశారు. పీవోకే సహా జమ్మూకశ్మీర్ మొత్తాన్ని భారత్‌లో విలీనం చేయాలని భారత ప్రభుత్వా నికి సూచించారు. కశ్మీర్‌ను పాక్ ఆక్రమించడాన్ని తాను గతంలోనూ వ్యతిరేకించానని.. ఎప్పటికీ వ్యతిరేకిస్తూనే ఉంటానన్నారు. ఆర్టికల్ 370 రద్దును ఇప్పుడు కాకుండా 1992లో కశ్మీరీ పండితుల వలస కన్నా ముందే చేపట్టాల్సిందని అభిప్రాయం వ్యక్తం చేశారు. జైపుర్ లో జరిగిన హై టీ కార్యక్రమంలో బ్రిటన్ ఎంపీ మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. అక్రమంగా ఆక్రమించడమే కాకుండా.. పీవోకే ప్రాంతంలో పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని విస్తరిస్తుండం సరైన చర్య కాదని బాబ్ బ్లాక్‌మన్ అన్నారు. జమ్మూ కశ్మీర్ మొత్తాన్ని భారత్‌లో విలీనం చేసుకోవాలని తాను అనేకసార్లు సూచించినట్లు తెలిపారు. గతేడాది పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని తీవ్రంగా ఖండించారు. కొన్నేళ్లుగా జమ్మూ కశ్మీర్‌లో పరిస్థితులు మెరుగుపడుతుం డడంతో అక్కడ శాంతి నెలకొందని తాను భావించానని.. కానీ పహల్గాం దాడితో ఉగ్ర సమస్య మళ్లీ వెలుగులోకి వచ్చిందన్నారు. భారత సరిహద్దుల్లో ఉగ్రవాదాన్ని విస్తరిస్తే ఇరుదేశాల మధ్య కొనసాగుతున్న కాల్పుల విరమణ ఒప్పందం ఉల్లంఘనకు గురయ్యే అవకాశం ఉంటుందని.. పాక్‌ను హెచ్చరించారు.



### బిజెపి రాష్ట్ర నాయకత్వానికి సుగుణ రెడ్డి

## నూతన సంవత్సర శుభాకాంక్షలు

- పుష్పగుచ్చాలు అందజేసి, శాలువాలతో సన్మానించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన సుగుణ రెడ్డి



**మేడిపల్లి, రాజముద్ర న్యూస్:** నూతన సంవత్సర సంబురాల సందర్భంగా తెలంగాణ రాష్ట్ర భారతీ-య జనతా పార్టీ అగ్ర నాయకత్వాన్ని తెలంగాణ రాష్ట్ర మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు కంజుల సుగుణ రెడ్డి మర్యాదపూ ర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ, పార్టీ బలోపేతానికి వారి మార్గదర్శకత్వం ఎంతో అవసరమని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావు, రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ చంద్రశేఖర్ తివారి, అభయ పటేల్ లను సుగుణ రెడ్డి విడివిడిగా కలుసుకున్నారు. వారికి శాలువాలు కప్పి, పుష్పగుచ్చాలు అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పార్టీ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణపై నాయకులతో చర్చించారు. నూతన సంవత్సరంలో పార్టీ మరింత ఉత్సాహంతో ప్రజల్లోకి వెళ్లాలని, కేంద్ర ప్రభుత్వ పథకాలను ఇంటింటికీ చేరవేయడంలో కార్యకర్తలు చురుకైన పాత్ర పోషించాలని నాయకులు ఈ సందర్భంగా ఆకాంక్షంచారు.

## అమెరికాలో హైదరాబాద్ యువతి హత్య కేసు..

### తమిళనాడులో అనుమానితుడి అరెస్ట్..



**తమిళనాడు :** అమెరికాలో హైదరాబాద్ యువతి గోడిశాల నిఖిత హత్య కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో అనుమానితుడిగా ఉన్న ఆమె మాజీ బాయ్‌ఫ్రెండ్ అర్జున్ శర్మను ఇంటర్‌పోల్ పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. ఇప్పటికే అతడిపై అమెరికా పోలీసులు అరె-స్టు వారెంట్ జారీ చేసిన సంగతి తెలిసిందే. 27 ఏళ్ల నిఖిత మేరీల్యాండ్‌లో అనుమానాస్పద రీతిలో మృతిచెందిన సంగతి తెలిసిందే. డిసెంబరు 31 నుంచి కన్పించకుండా పోయిన ఆమె మృతదేహాన్ని జనవరి 3న అర్జున్ శర్మ అపార్ట్‌మెంట్‌లో గుర్తించారు. ఆమె శరీరంపై కత్తిపోట్లు ఉన్నట్లు అమెరికా పోలీసులు తెలిపారు. అర్జున్ శర్మనే ఆమెను హత్య చేసి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. అయితే, నిఖిత అదృశ్యంపై జనవరి 2న అర్జున్ స్వయంగా పోలీసులకు ఫిర్యాదు చేయడం గమనార్హం. అదే రోజున అతడు భారత్‌కు తిరిగి వచ్చినట్లు అమెరికా పోలీసులు గుర్తించారు. అతడిపై అరెస్ట్ వారెంట్ జారీ చేశారు. అర్జున్ శర్మ ఆచూకీ కోసం యూఎస్ ఫెడరల్ ఏజెన్సీలు భారత అధికారులతో సంప్రదింపులు జరిపాయి. ఈ క్రమంలో నిఘా అధికారుల నుంచి అందిన కచ్చితమైన సమాచారంతో ఇంటర్‌పోల్ పోలీసులు తమిళనాడులో అనుమానితుడిని అరెస్ట్ చేశారు. అతడిని అమెరికాకు అప్పగించేందుకు అధికారిక ప్రక్రియ ప్రారంభించనున్నట్లు తెలుస్తోంది.


## అస్సాంలో భూకంపం..

**గువాహటి:** ఈశాన్య రాష్ట్రాలైన అస్సాం, త్రిపురలోని వివిధ ప్రాంతాల్లో భూకంపం సంభవించింది. అస్సాంలోని మోరిగావ్‌లో భూ ప్రకంపనల తీవ్రత 5.1గా నమోదు కాగా.. త్రిపురలోని గోమతిలో 3.9గా నమోదైంది. మోరిగావ్‌కు 50కి.మీ లోతులో భూకంప కేంద్రాన్ని గుర్తించారు. దీని ప్రభావంతో మేఘాలయలో కూడా వివిధ చోట్ల స్వల్పంగా భూమి కంపించింది.

# హైదరాబాద్‌లో అమ్ముడవ్వాల్సిన ఇళ్లు తగ్గాయ్

గత ఏడాది (2025) ముగిసేసరికి హైదరాబాద్‌లో అమ్ముడవ్వాల్సిన ఇళ్లు/ఫ్లాట్ల సంఖ్య 96,140 గా ఉన్నట్లు స్థిరాస్తి కన్సల్టెంట్ అనరాక్ తాజా నివేదికలో తెలిపింది. 2024లో ఈ సంఖ్య 97,765 కాగా, ఈసారి 2% తగ్గాయి. హైదరాబాద్ సహా దేశంలోని 7 ప్రధాన నగరాల్లో అమ్ముడవ్వాల్సిన ఇళ్లు/ఫ్లాట్లు 2025లో 5,76,617గా ఉన్నాయి. 2024లోని 5,53,073 ఇళ్లతో పోలిస్తే, ఇవి 4% అధికం. పలు నగరాల్లో గిరాకీని మించి, కొత్త ఇళ్ల సరఫరా ఉండటమే ఈ పరిస్థితికి కారణమని పేర్కొంది. గత ఏడాదిలో ఏడు ప్రధాన నగరాల్లో ఇళ్లు/ఫ్లాట్ల విక్రయాలు 14% తగ్గి 3,95,625కు చేరాయి. కొత్త ఇళ్ల సరఫరాలు 2% పెరిగి 4,19,170 ఇళ్లకు చేరినట్లు తెలిపింది. హైదరాబాద్, ముంబయిల్లో అమ్ముడవ్వాల్సిన ఇళ్లు తగ్గితే, ఢిల్లీ-ఎన్‌సీఆర్, పుణె, చెన్నై, బెంగళూరు, కోల్‌కతాల్లో పెరిగాయి.








## నష్టాల్లో ముగిసిన సూచీలు

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. ఉదయం ఫ్లాట్‌గా ప్రారంభమైన సూచీలు, మధ్యాహ్నం తర్వాత ఒత్తిడికి లోనయ్యాయి. ముఖ్యంగా ఐటీ, ఆయిల్ అండ్ గ్యాస్ షేర్లు అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. భారత్‌పై మరోసారి సుంకాలు పెంచుతానని ట్రంప్ హెచ్చరించడం సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. ముఖ్యంగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్ వంటి ప్రధాన స్టాక్స్ సూచీలపై ఒత్తిడి పెంచాయి. సెన్సెక్స్ ఉదయం 85,640.05 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 85,762.01) నష్టాల్లో ప్రారంభమైంది. ఆరంభంలో కాసేపు లాభాల్లోకి వచ్చిన సూచీ.. మధ్యాహ్నం తర్వాత నష్టాల్లోకి జారుకుంది. ఇంట్రాడేలో 85,315.33 వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 322.39 పాయింట్ల నష్టంతో 85,439.62 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 90.28గా ఉంది. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 60.76 వద్ద కొనసాగుతుండగా.. బంగారం 4,435 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.




## పీఎఫ్ ఖాతా నుంచి ఎల్ఐసీ ప్రీమియం కట్టొచ్చని తెలుసా?


ఈపీఎఫ్ స్కీమ్ ప్రకారం.. కొత్త పాలసీ కొనుగోలుకు, ప్రీమియం చెల్లింపులకు పీఎఫ్ నిల్వలను ఉపయోగించుకునే అవకాశం ఉంది. యాక్టివ్ పీఎఫ్ అకౌంట్ ఉన్నవారు ఈ ఆప్షన్ వినియోగించుకోవచ్చు. రెండు నెలల వేతనానికి సమానమైన నిల్వలు కలిగి ఉండాలి. ఆ పాలసీ చందాదారుడి పేరుమీదే ఉండాలి. జీవిత భాగస్వామి లేదా పిల్లల పేరు మీద ఉన్న పాలసీ ప్రీమియంలు చెల్లించడానికి వీల్లేదు. వార్షిక ప్రీమియంల చెల్లింపులకు మాత్రమే ఉపయోగపడుతుంది. ఇతర ప్రైవేటు బీమా ప్రీమియంలను చెల్లించే వెసులుబాటు లేదు. ఈ ఆప్షన్‌ను వినియోగించాలంటే ఈపీఎఫ్ఓ వెబ్‌సైట్ నుంచి ఫారం- 14ను డౌన్‌లోడ్ చేసుకుని సబ్మిట్ చేయాల్సి ఉంటుంది. ఈపీఎఫ్ఓ వెబ్‌సైట్‌లోకి వెళ్లి యూఏఎన్, పాస్‌వర్డ్‌తో లాగిన్ కావాలి. వెబ్‌సైట్‌లోని కేవైసీ సెక్షన్‌లోకి వెళ్లి అక్కడ ఎల్ఐసీ అనే ఆప్షన్‌ను ఎంపిక చేసుకోవాలి. పాలసీ నంబర్, ఇతర వివరాలను సమర్పించాలి. పాలసీ వివరాలను లింక్ చేశాక.. ప్రీమియం మొత్తం ఆటోమేటిక్‌గా పీఎఫ్ ఖాతా నుంచి డెబిట్ అవుతుంది. ప్రీమియం తేదీ మిస్ అవ్వకుండా పాలసీ చెల్లింపులు చేయడానికి ఈ ఆప్షన్ ఉపయోగపడుతుంది. ప్రీమియం చెల్లింపులకు బయట రుణం తీసుకోవాల్సిన అవసరాన్ని తప్పిస్తుంది. అదే సమయంలో రిటైర్మెంట్ సేవింగ్స్ కోసం ఉద్దేశించిన పీఎఫ్ నిల్వలు కరిగిపోయే అవకాశం ఉంది. కాబట్టి ఆర్థిక కష్టాలు ఎదురైనప్పుడు మాత్రమే ఈ ఆప్షన్ వినియోగించుకోవడం ప్రయోజనకరమని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు.



## అభిమానులను హెచ్చరించిన రోహిత్ శర్మ

టీమ్‌ఇండియా స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ తన అభిమానులను హెచ్చరించిన వీడియో ఒకటి సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. హిట్ మ్యాన్ కారులో చాలా నెమ్మదిగా వెళుతున్నాడు. అప్పుడు అభిమానులు అతడి చేతిని అందుకుంటూ సెల్ఫీలు దిగుతున్నారు. వారిలో ఇద్దరు అభిమానులు కొంచెం అతిగా ప్రవర్తించారు. వారు రోహిత్ శర్మ చేతిని లాగుతూ.. సెల్ఫీ దిగేందుకు ప్రయత్నించారు. దీంతో రోహిత్ కాస్త అసహనానికి లోనయ్యాడు. వారిని హెచ్చరిస్తూ.. కారు అద్దాలు మూసి వేసి.. ముందుకు సాగాడు. రోహిత్ శర్మ తాజాగా.. విజయ్ హజారే ట్రోఫీలో ముంబయి తరపున ఆడాడు. సిక్కింతో జరిగిన మ్యాచ్‌లో భారీ శతకం (155) బాదాడు. అయితే ఉత్తరాఖండ్‌తో జరిగిన మ్యాచ్‌లో డకౌట్‌గా వెనుదిరిగాడు. జనవరి 11 నుంచి న్యూజిలాండ్.. భారత్‌లో పర్యటించనుంది. ఇందులోభాగంగా మూడు వన్డేలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో బీసీసీఐ.. శనివారమే భారత జట్టును ప్రకటించింది. అందులో రోహిత్ శర్మ చోటు దక్కించుకున్నాడు. 2025లో రోహిత్‌శర్మ పలు మైలురాళ్లను అధిగమించాడు. టీమ్‌ఇండియా ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ సాధించడంలో కీలక పాత్ర పోషించాడు. అలాగే అంతర్జాతీయ క్రికెట్‌లో 20,000 పరుగులు పూర్తి చేసుకున్న బ్యాటర్‌గా రికార్డ్ సృష్టించాడు. భారత్ తరఫున అత్యధిక వన్డే పరుగులు సాధించిన మూడో బ్యాటర్‌గా నిలిచాడు. వన్డేల్లో అత్యధిక సిక్సులు కొట్టిన బ్యాటర్‌గానూ రికార్డ్ సృష్టించాడు. ప్రస్తుతం రోహిత్ శర్మ 279 వన్డేల్లో 355 సిక్సులు బాదాడు. అలాగే అతడు 2025లో 14 ఇన్నింగ్స్‌ల్లో 50.00 యావరేజ్, 100కు పైగా స్ట్రైక్‌రేట్‌తో 650 పరుగులు సాధించాడు. ఇందులో రెండు సెంచరీలు, నాలుగు అర్ధశతకాలున్నాయి.

## ప్రొఫెషనల్ టెన్నిస్ ప్లేయర్స్ అసోసియేషన్ నుంచి వైదొలగిన జకోవిచ్




టెన్నిస్ దిగ్గజం నొవాక్ జకోవిచ్.. ప్రొఫెషనల్ టెన్నిస్ ప్లేయర్స్ అసోసి యేషన్ నుంచి వైదొలుగుతున్నట్లు తాజాగా ప్రకటించాడు. అసోషియేషన్‌లో పారదర్శకత లోపించడం వల్లే ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని 'ఎక్స్'లో పోస్ట్ పెట్టాడు. 'ప్రొఫెషనల్ టెన్నిస్ ప్లేయర్స్ అసోసియేషన్‌ను స్థాపించినప్పుడు వాసెక్, నేను చూపించిన దార్శనికత.. ఆటగాళ్లకు బలమైన, స్వతంత్ర స్వరాన్ని అందించిందని నేను గర్విస్తున్నాను. కానీ.. ప్రస్తుతం సంస్థ నడుస్తున్న విధానాలతో నేను ఇకపై ఏకీభవించలేవని స్పష్టమైంది' అని అతడు వాపోయాడు. ప్రొఫెషనల్ టెన్నిస్ ప్లేయర్స్ అసోసియేషన్ అనేది పురుష, మహిళా టెన్నిస్ ఆటగాళ్ల సంఘం. దీన్ని 2019లో వాసెక్ పోస్పిసిల్, నొవాక్ జకోవిచ్ స్థాపించారు.



## సొంత క్రీడా సంస్థను ప్రారంభించిన నీరజ్ చోప్రా

ఒలింపిక్ స్వర్ణపతక విజేత, భారత స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా సొంత క్రీడా సంస్థను ప్రారంభించారు. జేఎస్‌డబ్ల్యూ స్పోర్ట్స్ సంస్థ నుంచి విడిపోయి 'వెల్ స్పోర్ట్స్' అనే క్రీడా సంస్థను ప్రారంభించారు. ఇందులో భాగంగా ఆయన మాట్లాడుతూ.. తన కెరీర్‌లో జేఎస్‌డబ్ల్యూ నిర్ణయాత్మక పాత్ర పోషించిందని తెలిపారు. దాని నుంచి నేర్చుకున్న విలువలనే తన తదుపరి ప్రయాణంలోనూ కొనసాగిస్తానన్నారు. కాగా 2016 నుంచి నీరజ్ జేఎస్‌డబ్ల్యూతో కలిసి పనిచేస్తున్నారు. దశాబ్ద కాలం పాటు నీరజ్‌తో కలిసి పనిచేయడం తమకు మంచి అనుభవమని, భవిష్యత్తులో అతడు మరిన్ని విజయాలు సాధించాలని కోరుకుంటున్నట్లు జేఎస్‌డబ్ల్యూ స్పోర్ట్స్ సీఈఓ దివ్యాంశు సింగ్ పేర్కొన్నారు.

## ఐపీఎల్ ప్రసారాలు బంగ్లాదేశ్‌లో నిషేధం



తమ దేశంలో ఐపీఎల్ ప్రసారాలపై బంగ్లాదేశ్ ప్రభుత్వం నిషేధం విధిస్తూ ఆదేశాలు జారీ చేసింది. బంగ్లాదేశ్‌లో రాజకీయ అనిశ్చితి వల్ల హిందువులపై వరుస దాడులు జరుగుతున్నాయి. దీంతో ఐపీఎల్‌లో ఆ దేశానికి చెందిన ముస్తాఫిజుర్ రెహమాన్‌ను తీసుకోవడంపై విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఆ ఆటగాడిని రిలీజ్ చేయమని బీసీసీఐ.. కోల్‌కతా నైట్ రైడర్స్ ఫ్రాంఛైజీని ఆదేశించింది. ఐపీఎల్ మినీ వేలం 2026లో ముస్తాఫిజుర్‌ను రూ.9.20 కోట్ల భారీ ధరకు దక్కించుకున్న కేకేఆర్.. బీసీసీఐ ఆదేశాలతో అతన్ని రిలీజ్ చేసింది. దీంతో బంగ్లాదేశ్ ప్రభుత్వం తాజాగా తమ దేశంలో ఐపీఎల్‌పై నిషేధం విధించింది. అలాగే.. వచ్చే నెలలో భారత్, శ్రీలంక వేదికగా టీ20 వరల్డ్ కప్ 2026 జరగనుంది. తమ మ్యాచ్‌లను భారత్ వెలుపల నిర్వహించాలని, బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు ఐసీసీకి విజ్ఞప్తి చేసిన విషయం తెలిసిందే. '2026 మార్చి 26 నుంచి జరగనున్న ఐపీఎల్ కోసం కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టు నుంచి బంగ్లాదేశ్ స్టార్ ఆటగాడు ముస్తాఫిజుర్ రెహమాన్‌ను మినహాయించడంపై బీసీసీఐ నుంచి ఒక ఆదేశం వెలువడిందని సమాచారం అందుతోంది. భారత క్రికెట్ బోర్డు అటువంటి నిర్ణయం తీసుకోవడానికి ఎటు వంటి హేతుబద్ధమైన కారణం తెలియదు. ఈ పరిస్థితుల్లో.. తదుపరి నోటీసు వచ్చేవరకు ఐపీఎల్ ప్రసారాలను నిలిపివే యాలి' అని బంగ్లాదేశ్ ప్రభుత్వం ఆ ఆదేశాల్లో పేర్కొంది.

## మహ్మద్‌సిరాజ్ దురదృష్టవంతుడు

### ఏబీ డివిలియర్స్



టీమ్‌ఇండియా ఫాస్ట్ బౌలర్ మహ్మద్ సిరాజ్ టీ20 వరల్డ్ కప్‌నకు ఎంపిక కాకపోవడం దురదృష్టకరమని దక్షిణాఫ్రికా మాజీ క్రికెటర్ ఏబీ డివిలియర్స్ అన్నాడు. తన యూట్యూబ్ ఛానల్ వేదికగా అతడు ఈ అభిప్రాయాన్ని వ్యక్తంచేశాడు. భారత సెలక్టర్లు ఆటగాళ్ల ఫామ్, నాణ్యత కంటే.. జట్టు కూర్పు పైనే ఎక్కువ దృష్టిపెట్టారని డివిలియర్స్ విశ్లేషించాడు. 'మహ్మద్ సిరాజ్ వన్డే జట్టులో స్థానం సంపాదించుకున్నాడు. కానీ దురదృష్టవశాత్తూ టీ20 వరల్డ్ కప్ జట్టుకు ఎంపిక కాలేదు. జస్‌ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్ ఎంపికయ్యారు. హర్షిత్ రాణా బ్యాటింగ్ కూడా చేయగలడు. అందుకే సెలక్టర్లు అతన్ని జట్టులోకి ఎంపిక చేశారు. వారు కేవలం సీమ్ బౌలర్లకే ప్రాధాన్యం ఇవ్వలేదు. స్పిన్నర్ల మీద కూడా దృష్టి పెట్టారు. ఒకవేళ వారు సీమర్లతో పాటు వైట్లు సాధిస్తే.. అది బోనస్ అవుతుంది' అని డివిలియర్స్ అన్నాడు. మహ్మద్ సిరాజ్ చివరిసారిగా టీమ్‌ఇండియా తరఫున జులై 2024లో టీ20 మ్యాచ్ ఆడాడు. జస్‌ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్‌తో కలిసి హర్షిత్ రాణా పేస్ బౌలింగ్ చేస్తున్నాడు. బ్యాట్‌తోనూ పరుగులు రాబట్టగలగడం అతడికి సానుకూలంగా మారింది. దీంతో జట్టు సమతూకం కోసం సెలక్టర్లు అతడి వైపు మొగ్గు చూపుతున్నారు. మహ్మద్ సిరాజ్.. టీ20 జట్టుకు ఎంపిక కాకపోయినప్పటికీ జనవరి 11 నుంచి న్యూజిలాండ్‌తో ప్రారంభం కానున్న వన్డే సిరీస్‌లో పాల్గొనున్నాడు. గతంలో ఏబీ డివిలియర్స్, మహ్మద్ సిరాజ్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు పాల్గొన్న విషయం తెలిసిందే.

## ముగిసిన రెండోరోజు ఆట

### 218 పరుగుల వెనుకంజలో ఆస్ట్రేలియా



యాషెస్ సిరీస్‌లో భాగంగా సిడ్నీ వేదికగా ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్ మధ్య అయిదో టెస్ట్ మ్యాచ్ జరుగుతున్న విషయం తెలిసిందే. ఆస్ట్రేలియా రెండోరోజు ఆట ముగిసే సమయానికి 34.1 ఓవర్లకు 2 వైట్లు కోల్పోయి 166 పరుగులు చేసింది. ఆసీస్ జట్టు ఇంకా 218 పరుగుల వెనకంజలో ఉంది. అంతకుముందు 211/3 ఓవర్‌నైట్ స్కోర్‌తో బ్యాటింగ్ ప్రారంభించిన ఇంగ్లాండ్ 97.3 ఓవర్లలో 384 పరుగులకు ఆలౌటైంది. ఆసీస్‌కు బ్యాటింగ్‌లో శుభారంభం దక్కింది. జేక్ వెదర్లాడ్, ట్రావిస్ హెడ్ మొదటి వైట్‌కు 74 బంతుల్లో 57 పరుగుల భాగస్వామ్యాన్ని అందించారు. అనంతరం జేక్ వెదర్లాడ్ (21, 36 బంతుల్లో, 4 ఫోర్లు) బెన్‌స్టోక్స్ బౌలింగ్‌లో ఎల్‌బీడబ్ల్యూగా వెనుదిరిగాడు. ట్రావిస్ హెడ్ సెంచరీకి చేరువలో (91, 97 బంతుల్లో 15 ఫోర్లు) ఉన్నాడు. లబుషేన్ తృటిలో హాఫ్ సెంచరీ (48, 68 బంతుల్లో, 7 ఫోర్లు) చేసే అవకాశాన్ని చేజార్చుకున్నాడు. నైట్ వాచ్‌మన్‌గా వచ్చిన మిచెల్ నీసర్(1) నాటౌట్‌గా నిలిచాడు. ఇంగ్లాండ్ బౌలర్లలో బెన్‌స్టోక్స్ రెండు వైట్లు తన ఖాతాలో వేసుకున్నాడు. ఇంగ్లాండ్ ఇన్నింగ్స్‌లో జోరూట్ భారీ సెంచరీ (160, 242 బంతుల్లో, 15 ఫోర్లు) సాధించాడు. టెస్టుల్లో అతడికిది 41వ సెంచరీ. దీంతో రికీపాంటింగ్ సరసన నిలిచాడు. హ్యారీ బ్రూక్ సెంచరీకి చేరువగా వచ్చినా.. సాధించలేకపోయాడు. 84 పరుగుల వద్ద (97 బంతుల్లో, 6 ఫోర్లు, 1 సిక్స్) పెవిలియన్‌కు చేరాడు. వైట్ కీపర్ బ్యాటర్ జెమ్మీస్మిత్ (46, 76 బంతుల్లో, 6 ఫోర్లు, 1 సిక్స్) ఫర్వాలేదనిపించాడు. ఆస్ట్రేలియా బౌలర్లలో మిచెల్ నీసర్ 4, మిచెల్ స్టార్క్, స్కాట్ బోలాండ్ తలో రెండు, కామెరూన్ గ్రీన్, లబుషేన్ చెరో వైట్ తీసుకున్నారు.




## ఎయిరిండియా సీఈఓ విల్సన్‌కు ఉద్వాసన..?

ఎయిరిండియా ప్రస్తుత సీఈఓ క్యాంప్‌బెల్ విల్సన్‌కు టాటాలు గుడ్‌బై చెప్పనున్నారా? ఆయనపై టాటా గ్రూప్ పెద్దలు అసంతృప్తిగా ఉన్నారా? అంటే అవుననే అంటున్నాయి ఆంగ్ల మీడియా కథనాలు. విల్సన్‌కు త్వరలోనే ఉద్వాసన పలికి.. ఆయన స్థానంలో మరో వ్యక్తిని సీఈఓగా చేయాలని టాటాసన్స్ భావిస్తోందని ఎకనామిక్ టైమ్స్ తన కథనంలో పేర్కొంది. ఈమేరకు ప్రముఖ అంతర్జాతీయ విమానయాన సంస్థలకు చెందిన సీనియర్ లీడర్లతో చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. అమెరికా, యూకేకు చెందిన రెండు ప్రముఖ విమానయాన సంస్థల చీఫ్ ఎగ్జిక్యూటివ్‌లతో కూడా గ్రూప్ ఛైర్మన్ చంద్రశేఖరన్ మాట్లాడినట్లు సదరు కథనం పేర్కొంది. విమానయాన సంస్థను వృద్ధిలోకి తీసుకురావడంలో ఆశించిన మేర పనితీరు కనిపించకపోవడంపై చంద్రశేఖరన్ అసంతృప్తిగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ కారణంగానే విల్సన్‌ను మార్చాలని భావిస్తోంది. దీంతోపాటు ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్‌కు సీఈఓగా వ్యవహరిస్తున్న అలోక్ సింగ్‌ను కూడా మార్చాలని చర్చలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఎయిరిండియా సీఈఓ విల్సన్ పదవీ కాలం 2027 జూన్‌తో ముగియనుండగా.. అలోక్ సింగ్ పదవీకాలం కూడా 2027 వరకు ఉంది.

### విల్సన్‌పై అసంతృప్తి దేనికి?

న్యూజిలాండ్‌కు చెందిన క్యాంప్‌బెల్ విల్సన్ 2022 జులైలో ఎయిరిండియాలో చేరారు. విమానయాన సంస్థను అంతర్జాతీయ స్థాయిలో పోటీపడేలా తీర్చిదిద్దడం, ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచడం వంటి అంశాలతో ఐదేళ్ల ప్రణాళికను ప్రకటించారు. ఇందులోభాగంగా ఎయిరిండియాలో విస్తారా విలీనం సజావుగా సాగింది. కొన్ని కీలక రూట్లలో ఇండిగోను ఎయిరిండియా అధిగమించింది. అదే సమయంలో సప్లయ్ చైన్ అవరోధాల వల్ల కొత్త విమానాల రాక ఆలస్యం అయ్యింది. దీంతో సేవల్లో నాణ్యత, సమయపాలనలో పెద్దగా మెరుగుదల కనిపించలేదు. దీనికితోడు గతేడాది అహ్మదాబాద్‌లో జరిగిన ఘోర ప్రమాదం తర్వాత సంస్థ ప్రభుత్వ అధికారులు విల్సన్‌ను పక్కనపెట్టి నేరుగా టాటా గ్రూప్ పెద్దలతో మాట్లాడుతున్నారు. ఇదోరకంగా విల్సన్ పక్కన పెట్టడానికి కారణంగా కనిపిస్తోందని 'ఈటీ' పేర్కొంది. నిబంధనలు పాటించకపోవడం, కాలం చెల్లిన లైసెన్స్‌తో విమానం నడపడం వంటి కారణాలతో విల్సన్ సహా పలువురు ఎయిరిండియా ఉన్నతాధికారులకు డీజీసీఏ షోకాజ్ నోటీసులు కూడా జారీ చేసింది. కంపెనీ ఆర్థిక పరిస్థితి కూడా పెద్దగా మెరుగవకపోవడం వంటి కారణాలతో పదవీకాలం పూర్తికాకముందే విల్సన్‌ను తప్పించాలని టాటా గ్రూప్ భావిస్తోంది. దీనిపై టాటా గ్రూప్ అధికారికంగా స్పందించలేదు.

అక్షర రాజముద్ర
www.rajamudranews.com
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక



# విదేశాల్లో ది రాజాసాబ్ మేనియా


## విడుదలకు ముందే భారీగా టిక్కెట్ల అమ్మకాలు

ప్రభాస్ హీరోగా,దర్శకుడు మారుతి దర్శకత్వంలో తెరకెక్కిన భారీ చిత్రం 'ది రాజాసాబ్' ఇప్పటికే బాక్సాఫీస్ వద్ద సంచలనాలకి సంబంధించిన సంకేతాలు ఇస్తోంది. సంక్రాంతి కానుకగా జనవరి 9న ప్రపంచవ్యాప్తంగా విడుదలకు సిద్ధమవుతున్న ఈ మూవీకి విదేశీ మార్కెట్లలో అడ్వాన్స్ బుకింగ్‌లు బలంగా ప్రారంభమయ్యాయి. ప్రభాస్ క్రేజ్‌కు మరోసారి నిదర్శనంగా, ఉత్తర అమెరికాలో ఇప్పటివరకు 17,500కు పైగా టిక్కెట్లు అమ్ముడయ్యాయి. అలాగే యూకే మార్కెట్‌లో కూడా 17,500కు పైగా ప్రీ-సేల్స్ నమోదు కావడం విశేషం. 2026 జనవరి 8న ప్రారంభమయ్యే ప్రీమియర్ షోలకే ఇంత భారీ స్పందన రావడం, సినిమా ఓవర్సీస్‌లో బలమైన ఓపెనింగ్ రాబోతుందనే సంకేతాలను ఇస్తోంది. దర్శకుడు మారుతి ఈ సినిమాను దాదాపు మూడేళ్ల పాటు శ్రమించి తెరకెక్కించినట్టు సమాచారం. పూర్తి స్థాయి ఎంటర్‌టైన్‌మెంట్, కామెడీ, ఫ్యామిలీ ఎలిమెంట్స్‌తో పాటు ప్రభాస్‌ను సరికొత్తగా చూపించాలనే లక్ష్యంతో ఈ సినిమా రూపొందించబడింది. 'బాహుబలి', 'సలార్' లాంటి ఇంటెన్స్ పాత్రల తర్వాత ప్రభాస్‌ను లైట్ హార్టెడ్, ఫుల్ ఎంటర్‌టైనర్‌లో చూడాలన్న అభిమానుల ఆశలను 'ది రాజాసాబ్' తీర్చబోతుందనే అంచనాలు ఉన్నాయి. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీ.జి. విశ్వప్రసాద్ ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ కథానాయికలుగా నటిస్తుండగా, బాలీవుడ్ స్టార్ సంజయ్ దత్ కీలక పాత్రలో కనిపించను న్నారు. 'ది రాజాసాబ్' సినిమాను తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయా ళం భాషల్లో ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నారు. పాన్ ఇండియా స్థాయిలో ప్రభాస్‌కు ఉన్న మార్కెట్‌ను పూర్తిగా వినియోగించుకునేలా మేకర్స్ రిలీజ్ చేస్తున్నారు. మొత్తానికి, అడ్వాన్స్ బుకింగ్‌లతోనే ఓవర్సీస్‌లో హీట్ పెంచుతున్న 'ది రాజాసాబ్'? సంక్రాంతి రేసులో పెద్ద బ్లాక్‌బస్టర్‌గా నిలుస్తుందా లేదా అన్నది ఆసక్తికరంగా మారింది. ప్రభాస్ అభిమానులు మాత్రం ఈ సినిమాతో మరోసారి బాక్సాఫీస్ షేక్ అవుతుందని గట్టిగా నమ్ముతున్నారు.

# నటి రాశికి క్షమాపణలు చెప్పిన అనసూయ

నటి రాశికి అనసూయ క్షమాపణలు చెప్పారు. ఈ మేరకు సోషల్ మీడియలో పోస్టు పెట్టారు. మహిళల వస్త్రధారణపై నటుడు శివాజీ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే. దానిపై స్పందిస్తూ రాశి ఇటీవల ఓ వీడియో విడుదల చేశారు. కొన్నాళ్ల క్రితం ఓ టీవీ కార్యక్రమంలో అనసూయ తనను కించపరిచేలా మాట్లాడారంటూ అందులో మండిపడ్డారు. ఈ క్రమంలోనే అనసూయ రియాక్ట్ అవుతూ.. ఓ నోట్ విడుదల చేసి క్షమాపణ చెప్పారు. అప్పుడున్న పరిస్థితుల్లో దానిని నిలదీసే శక్తి తనకు లేదన్నారు. ఆ తర్వాత తనలో మార్పు మొదలైందని తెలిపారు. తన తప్పును అంగీకరిస్తున్నానని అందుకు క్షమించమని కోరారు. "వెనక్కి వెళ్లి ఇప్పుడు దాన్ని సరిదిద్దలేను. కొన్నాళ్ల తర్వాత నాలో వచ్చిన మార్పును మీరు గమనించవచ్చు. మహిళలందరి భద్రత గురించి గట్టిగా మాట్లాడుతున్న నాకు వ్యతిరేకంగా అప్పటి మాటలు గుర్తు చేస్తూ ద్వేషపూరిత ప్రచారం చేస్తున్నారు. నన్ను అవమానించడానికి ఉపయోగిస్తున్న ఈ కథనాలు మీకు ఎంత ఇబ్బందికరంగా ఉన్నాయో ఊహించగలను. నా బాధ్యతగా తప్పుని అంగీకరిస్తూ మీకు క్షమాపణ చెబుతున్నా" అని అనసూయ నోట్‌లో పేర్కొన్నారు.





సినీ ప్రియులకు పెద్ద పండగ సంక్రాంతి ఈ యేడాది 'ది రాజాసాబ్'తో మొదలుకానుంది. మారుతి దర్శకత్వంలో ప్రభాస్ హీరోగా తెరకెక్కిన ఈ సినిమా సంక్రాంతి కానుకగా జనవరి 9న విడుదల కానుంది. ఇప్పటికే పాటలు, ప్రచార చిత్రాలు ఆసక్తిని రెట్టింపు చేయగా తాజాగా మాళవికా మోహనన్ కొన్ని విషయాలు పంచుకున్నారు. 'నటీనటుల మధ్య సన్నివేశాలు బాగా రావాలంటే కెమిస్ట్రీ ముఖ్యం. ఈ చిత్రంలో ప్రభాస్‌కు, నాకు మధ్య చాలా సన్నివేశాలు ఉన్నాయి. ఇందులో నాది నిడివి ఎక్కువ ఉన్న పాత్ర. నా సోలో సీన్ ఒకదాన్ని మూడు రోజులు పెద్ద స్విమ్మింగ్‌పూల్‌లో షూట్ చేశారు. ఆ మూడు రోజులు దాదాపు రోజుకు 10 గంటలు నీళ్లలోనే ఉండాల్సి వచ్చింది. నామీద మొసలి దాడి చేస్తున్నట్లు నటించాల్సిన సీన్. ఒకవైపు చలికి చర్మం మొత్తం మొద్దుబారిపోతున్న ఫీలింగ్ కలిగేది. అదే సమయంలో మొసలి దాడి చేస్తున్నట్లు ఎక్స్‌ప్రెషన్స్ పెట్టాలన్నారు. ఆ నీళ్లు కూడా దారుణంగా ఉన్నాయి. అందరూ

# స్విమ్మింగ్ షూట్ కోసం నీళ్లలోనే ఉండిపోయా

## రాజాసాబ్ సినిమాపై మాళవికా మోహనన్

అందులోకి దిగి షూట్ చేస్తున్నారు. పెయింట్, కెమికల్స్, వాడిపారేసిన వస్తువులు అన్నీ అందులో ఉన్నాయి. ఆ నీటిలోనే 3 రోజులు షూట్ చేశాం. అదొక వింత అనుభవం' అని మాళవికా మోహనన్ అన్నారు. ఇకపోతే హారర్ ఫాంటసీ కామెడీ చిత్రంగా 'రాజాసాబ్' రానుంది. ఇండియన్ స్క్రీన్‌పై ఇప్పటివరకూ ఇలాంటి కథ రాలేదని దర్శకుడు మారుతి తెలిపారు. 15 ఏళ్ల తర్వాత ఆడియన్స్ వింటేజ్ ప్రభాస్‌ను చూస్తారని చెప్పారు. ఇందులో ప్రభాస్ సరసన నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిద్ధి కుమార్ కనిపించనున్నారు. సంజయ్‌దత్, బొమన్ ఇరాని, జరీనా వహాబ్ తదితరులు కీలక పాత్రలు పోషించారు.



# ఎన్టీఆర్ లెవల్‌కు తగ్గట్లుగా ప్రశాంత్ నీల్ ప్లాన్

జూనియర్ ఎన్టీఆర్ ప్రస్తుతం కన్నడ స్టార్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో నటిస్తున్న విషయం తెలిసిందే. 'కేజీఎఫ్', 'సలార్' వంటి బ్లాక్‌బస్టర్ల తర్వాత ప్రశాంత్ నీల్.. ఎన్టీఆర్ హీరోగా సినిమా చేస్తున్నాడు అనగానే అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. అందుకే ఈ మూవీకి సంబంధించిన చిన్న అప్‌డేట్ బయటకు వచ్చినా క్షణాల్లోనే వైరల్ అవుతోంది. ఈ సినిమాను పూర్తిగా ఇంటర్నేషనల్ లెవల్లో తెరకెక్కించాలని ప్రశాంత్ నీల్ గట్టిగా నిర్ణయించుకున్నారట. తన అభిమాన నటుడు అయిన ఎన్టీఆర్‌కు కెరీర్‌లో మరిచిపోలేని బ్లాక్‌బస్టర్ ఇవ్వాలనే లక్ష్యంతో ఆయన ఎక్కడా క్వాలిటీ విషయంలో కాంప్రమైజ్ కావడం లేదని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. చిన్న చిన్న డిటైలింగ్ వరకు కూడా పర్ఫెక్షన్ కావాలనే ఆలోచనతో ప్రతి సీన్‌ను తెరకెక్కిస్తున్నారట. ఈ చిత్రాన్ని నిర్మిస్తున్న మైత్రి మూవీ మేకర్స్ సంస్థ కూడా దీనిని అత్యంత ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్‌గా తీసుకుంది. ఇటీవల నిర్మాత రవి చేసిన కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ కావడం కూడా ఈ సినిమాపై క్రేజ్ ఏ స్థాయిలో ఉందో చెప్పే ఉదాహరణగా మారింది. ఇటీవల హైదరాబాద్‌లో వేసిన భారీ సెట్‌లో ఈ సినిమా కొత్త షెడ్యూల్ మొదలైంది. ఈ షెడ్యూల్‌లో ప్రధాన పాత్రల మధ్య కీలకమైన సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారట. అంతేకాదు, ఎన్టీఆర్‌తో ఒక పవర్‌ఫుల్ యాక్షన్ సీక్వెన్స్‌ను కూడా ఈ షెడ్యూల్‌లోనే తెరకెక్కించనున్నట్లు సమాచారం. హైదరాబాద్ షెడ్యూల్ పూర్తయ్యాక ఎన్టీఆర్ మరోసారి విదేశాలకు వెళ్లనున్నారని తెలుస్తోంది. అక్కడ జరిగే షెడ్యూల్‌తో సినిమా టాకీ పార్ట్ దాదాపుగా పూర్తవుతుందని టాక్. గ్రాండ్ స్కేల్‌లో, భారీ యాక్షన్ ఎపిసోడ్‌లతో ఈ మూవీని ప్రేక్షకులకు ఓ విజువల్ ఫీస్ట్‌లా అందించేందుకు టీమ్ ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే ఈ సినిమాకు 'డ్రాగన్' అనే టైటిల్‌ను ఫిక్స్ చేయనున్నారని వార్తలు వినిపిస్తున్నాయి. ఇంటర్నేషనల్ లెవల్లో సెట్ అయ్యే కథకు ఈ టైటిల్ పర్ఫెక్ట్‌గా ఉంటుందని మేకర్స్ భావిస్తున్నారట. అధికారిక ప్రకటన మాత్రం ఇంకా రావాల్సి ఉంది. ప్రశాంత్ నీల్ గత సినిమాల్లో హీరో ఎలివేషన్స్, మాస్ యాక్షన్‌కు పెద్ద పీట వేసిన విషయం తెలిసిందే. అయితే ఈ సినిమాలో కేవలం హీరోయిజం మాత్రమే కాకుండా బలమైన ఎమోషన్స్‌కు



కూడా సమాన ప్రాధాన్యం ఇచ్చినట్లు తెలుస్తోంది. ఎన్టీఆర్ నటనలోని ఎమోషనల్ డెప్త్‌ను కొత్త కోణంలో చూపించాలనే ప్రయత్నంలో ప్రశాంత్ నీల్ ఉన్నారు.

# అట్లీతో ముగింపు దశలో అల్లు మూవీ

## లోకేశ్ కనగరాజ్‌తో మరో మూవీకి బన్నీ ప్లాన్

టాలీవుడ్ స్టార్ హీరో అల్లు అర్జున్ ప్రస్తుతం దర్శకుడు అట్లీతో చేస్తున్న భారీ సైన్స్ ఫిక్షన్ ప్రాజెక్ట్‌తో దేశవ్యాప్తంగా వార్తల్లో నిలుస్తున్నారు. భారీ బడ్జెట్, అంతర్జాతీయ స్థాయి విజువల్స్, హాలీవుడ్ టెక్నాలజీతో రూపొందుతున్న ఈ సినిమా ఇప్పటికే సగానికి పైగా షూటింగ్ పూర్తి చేసుకుంది. ఈ ఏడాది దసరా కానుకగా సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలనే లక్ష్యంతో మేకర్స్ వేగంగా పనులు పూర్తి చేస్తున్నారు. బన్నీ మాస్ ఇమేజ్‌ను పూర్తిగా కొత్త కోణంలో చూపించబోతున్న ఈ కథ, అట్లీ మార్క్ ఎమోషన్‌తో పాటు గ్రాండ్ యాక్షన్‌ను కలబోస్తుందని టాక్ వినిపిస్తోంది. ఈ సినిమా పూర్తయ్యాక అల్లు అర్జున్ తదుపరి అడుగు ఏమిటన్నదే ఇప్పుడు ఇండస్ట్రీలో ప్రధాన చర్చగా మారింది. తాజా సమాచారం ప్రకారం, యూత్‌కి, మాస్‌కి కనెక్ట్ అయ్యే రియలిస్టిక్ గ్యాంగ్‌స్టర్ కథలతో గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు లోకేశ్ కనగరాజ్‌తో బన్నీ సినిమా దాదాపు ఫిక్స్ అయినట్లు తెలుస్తోంది. అట్లీ మూవీ షూటింగ్ ఆగస్టు నాటికి ముగిస్తే, ఆ వెంటనే లోకేశ్ ప్రాజెక్ట్‌పై బన్నీ ఫోకస్ పెడతారని ప్రచారం జరుగుతోంది. ఈ సినిమాను ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించే అవకాశాలున్నాయని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఇదిలా ఉండగా, అట్లీ?అల్లు అర్జున్ సినిమా డిజిటల్ హక్కులపై కూడా భారీ చర్చ నడుస్తోంది. ఈ చిత్ర ఓటీటీ రైట్స్ కోసం ప్రముఖ డిజిటల్ దిగ్గజం నెట్‌ఫ్లిక్స్ భారీ ఆఫర్ పెట్టినట్లు సమాచారం. ఈ డీల్ విలువ వందల కోట్లలో ఉండొచ్చన్న ప్రచారం ఇండస్ట్రీని ఆశ్చర్యానికి గురి చేస్తోంది. రిలీజ్‌కు ముందే ఇలాంటి రేంజ్ బిజినెస్ జరగడం బన్నీ మార్కెట్ స్టామినాకు నిదర్శనంగా చెప్పుకుంటున్నారు. మరోవైపు, తన తాజా చిత్రం 'కూలీ'పై వచ్చిన విమర్శలపై దర్శకుడు లోకేశ్ కనగరాజ్ ఇటీవల స్పందించారు. ప్రేక్షకుల నుంచి వచ్చిన ఫీడ్‌బ్యాక్‌ను సీరియస్‌గా తీసుకున్నానని, ఎక్కడ తడబడ్డామో



విశ్లేషించుకున్నానని తెలిపారు. తదుపరి సినిమాల్లో మరింత బలమైన కంటెంట్‌తో ముందుకు వస్తానని స్పష్టం చేశారు. దీంతో అల్లు అర్జున్‌తో ఆయన చేయబోయే సినిమా మరింత పవర్‌ఫుల్‌గా ఉండబోతోందన్న అంచనాలు మరింత పెరిగాయి. మొత్తానికి అట్లీతో ఒక గ్రాండ్ సైన్స్ ఫిక్షన్ విజన్, లోకేశ్ కనగరాజ్‌తో ఒక రఫ్ అండ్ రియల్ ప్రాజెక్ట్ ఈ రెండు కాంబినేషన్లతో అల్లు అర్జున్ పాన్ ఇండియా స్థాయిలో మరోసారి సత్తా చాటేందుకు సిద్ధమవుతున్నారని సినీ వర్గాలు విశ్లేషిస్తున్నాయి

# జన నాయగన్.. భగవంత్ కేసరికి కాపీయా?

విజయ్కథానాయకుడిగా హెచ్.వినోద్ దర్శకత్వంలో రానున్న చిత్రం 'జన నాయగన్' తెలుగులో జన నాయకుడు సంక్రాంతి కానుకగా జనవరి 9న తమిళ, తెలుగు, హిందీ భాషల్లో విడుదల కానుంది. ఇప్పుడు దీని విడుదలకు ముందు బాలకృష్ణ నటించిన 'భగవంత్ కేసరి' ఓటీటీలో ట్రెండింగ్‌లో టాప్ వన్‌లోకి వచ్చింది. 'జన నాయగన్' బాలకృష్ణ 'భగవంత్ కేసరి'కి రీమేక్ అంటూ ఎన్నో రోజులుగా వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. దీనిపై ఈ రెండు సినిమాల దర్శకులు స్పందించినప్పటికీ వీటికి చెక్ పడలేదు. మరికొన్ని రోజుల్లో ఈ సినిమా విడుదల కానున్న నేపథ్యంలో ఇప్పుడు అందరూ 'భగవంత్ కేసరి'ని చూసేస్తున్నారు. దీంతో అమెజాన్ ప్రైమ్‌లో ఉన్న ఆ చిత్రం రెండేళ్ల తర్వాత ఓటీటీలో ట్రెండింగ్‌లో టాప్1లోకి వచ్చేసింది. ఈ రీమేక్ వార్త ప్రచారం జరుగుతుండడంతో దర్శకుడు హెచ్.వినోద్ ఇటీవల స్పందించారు. 'నేను ఈ విషయాన్ని ధ్రువీకరించను. అలాగే కొట్టిపారేయను. ఇంతకుముందు కూడా మీకు ఈ విషయం చెప్పాను. ఇది దళపతి మూవీ. ఇది రీమేకా..? ఏదైనా చిత్రం నుంచి స్ఫూర్తిపొంది తీశారా? అన్న విషయంపై ప్రేక్షకులు ఆందోళనపడాల్సిన అవసరం లేదు' అని అన్నారు. అలాగే 'భగవంత్ కేసరి' తెరకెక్కించిన అనిల్ రావిపూడి కూడా ఈ ప్రచారంపై మాట్లాడారు. 'విజయ్‌ను నేను రెండు, మూడుసార్లు కలిశాను. మేము చాలా విషయాలు మాట్లాడుకున్నాం.



'జన నాయకుడు' కథ ఏంటనేది ఆ సినిమా విడుదలైన తర్వాతే మీకు అర్థమవుతుంది' అని చెప్పారు. ఇక విజయ్ చివరి సినిమా కావడంతో దీనిపై అందరిలో ఆసక్తి నెలకొంది. పొలిటికల్ యాక్షన్ థ్రిల్లర్‌గా సిద్ధమవుతోన్న ఈ మూవీలో విజయ్ సరసన పూజాహెగ్డే కథానాయికగా కనిపించనున్నారు.

Printed, Published and Owned by **RAVU RAJITHA**, Printed at **KAKATHIYA PRINTERS**, LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY**. **RAJAMUDRA PUBLICATIONS**, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684**, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com